ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 24 అక్టోబరు 2025

శివయ్యను చూసొద్దాం..!



- శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు
- కార్తీక మాసంలో తీర్థయాత్రలు
- ఆర్టీసీ 1వ డిపోలో కరపత్రాల ఆవిష్కరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో రాష్ట్రంలోని వివిధ శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను నడుపుతుందని ఆర్టీసీ ఒకటవ డిపో మేనేజర్ జీ. వెంకటేశ్వర్లు తెలిపారు. నెల్లూరు నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో గురువారం ఆయన శైవక్షేత్రాలు- అక్కడికి వెళ్లే బస్సుల వివరాలను తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

పంచారామ క్షేత్ర దర్శిని

పరమశివుడికి ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో ఒకే రోజు భక్తులు ఐదు ప్రముఖ శైవక్షేత్రాలను సందర్శించేలా పంచారామ క్షేత్ర దర్శిని పేరుతో ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని డిపో మేనేజర్ వివరించారు. అమరావతిలోని అమరారామం, భీమవరంలోని సోమేశ్వరరామం, పాలకొల్లులోని క్షీరారామం, ద్రాక్షారామంలోని భీమేశ్వరరామం, సామర్లకోటలోని కోమారారామం క్షేత్రాలను భక్తులు ఒకేరోజు దర్శించుకునేలా బస్సు సర్వీసులను నడుపుతున్నామని చెప్పారు. సూపర్‌లగ్జరీ బస్సు నెల్లూరు మెయిన్ బస్టాండు నుంచి అక్టోబరు 25,26 తేదీల్లో, నవంబరు 1,2,4,8,9,15,16 తేదీల్లోనూ రాత్రి 9 గంటలకు బయలుదేరుతుందన్నారు. పంచారామ క్షేత్రాలను వీక్షించేందుకు ప్రత్యేక బస్సులో ఒక్కరికి రూ.2,500ను టికెట్ ధరగా నిర్ణయించామన్నారు. బస్సులో ప్రయాణం చేసే ప్రతి భక్తుడికి మినరల్ వాటర్ బాటిల్, పసుపు, కుంకుమ, బిస్కెట్ ప్యాకెట్ ఉచితంగా ఇస్తామని ఆయన తెలిపారు.

త్రిలింగ క్షేత్ర దర్శిని

మూడు ప్రముఖ శైవక్షేత్రాలను సందర్శించుకునేలా భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతుందన్నారు. యాగంటి, మహానంది, శ్రీశైలం క్షేత్రాలకు అక్టోబరు 25,26 తేదీల్లో, నవంబరు 1,2,4,7,8,9,15,16 తేదీల్లో ప్రత్యేక బస్సులు ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి బయలుదేరుతాయని చెప్పారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన బస్సులు త్రిలింగ క్షేత్రాలను దర్శించుకొని మరుసటి రోజు ఉదయం నెల్లూరుకు చేరుకుంటాయన్నారు. ఇందుకుగాను సూపర్ లగ్జరీ బస్సులో టికెట్ ధర రూ.1800గా నిర్ణయించామన్నారు.

అరుణాచల దర్శనం

అగ్ని లింగమైన అరుణాచలేశ్వరుడిని దర్శించుకుని గిరిప్రదక్షిణ చేసుకునేందుకు ఈ నెల 25,26తేదీల్లో, నవంబరు 1,2,4,7,8,9, 15,16 తేదీల్లో ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు. ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి ఆయా తేదీలలో ఉదయం 9.30 గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ బస్సుల్లో ఒక్కో భక్తుడికి రూ.1200 చార్జీ వసూలు చేస్తున్నామని చెప్పారు.

శ్రీశైల యాత్ర

శ్రీశైలం దర్శనానికి మంగళవారం నుంచి నవంబరు 11 వరకు ప్రతిరోజూ రాత్రి 8.30 గంటలకు ప్రధాన బస్టాండు నుంచి శ్రీశైలంకు ప్రత్యేకంగా సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతున్నామని డీఎం తెలిపారు. ఈ బస్సులో రూ.670 చార్జీ వసూలు చేస్తారని చెప్పారు. ఆసక్తి కలిగిన భక్తులు నగరంలోని మెయిన్ బస్టాండులో ఉన్న రిజర్వేషన్ కౌంటర్‌లోనూ, సమీప ప్రాంతాల్లోని ఆర్టీసీ అథైరజ్డ్ ఏజెంట్ వద్ద, ఆన్‌లైన్‌లో 46480 సర్వీసు నెంబరుపై రిజర్వేషన్ చేసుకోవచ్చని డీఎం తెలిపారు. పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు అద్దె ప్రాతిపదికన బస్సులను ఇస్తున్నామన్నారు. పూర్తి సమాచారం కోసం 99592 25653, 0861 2323333, 94921 92238 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో నెల్లూరు ఒకట డిపో సీఐ సునీత తదితరులు పాల్గొన్నారు.



తీర్థ యాత్రల వివరాలు తెలిపే కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు, అధికారులు

తప్పిన ముప్పు



కూలిన పెంకుటిల్లు

ఉదయగిరి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కురుస్తున్న వర్షాలకు ఉదయగిరిలోని దిలావర్‌భాయ్‌వీధికి చెందిన షేక్ షాహిద పెంకుటిల్లు నేలకూలింది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోడలు నాని ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది.



సంగం మండలం పెరమన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న బీరాపేరు

- బలహీనపడిన వాయుగుండం
- తగ్గుముఖం పట్టిన వర్షాలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- జలదంకిలో యువకుడి మృతి
- రేపు మరో అల్పపీడనం..?



కావలి బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

నెల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా భారీ వర్షాలతో అల్లాడుతున్న జిల్లాకు ఉపశమనం లభించింది. వర్షాల తీవ్రత గురువారం అధికంగా ఉంటుందని తొలుత అంచనా వేసినా... బుధవారం రాత్రి తర్వాత వాయుగుండం క్రమేణా బలహీనపడింది. అదే సమయంలో తన దిశను మార్చుకోవడంతో జిల్లాకు ముప్పు తప్పింది. గురువారం ఉదయం నుంచి వాతావరణం మారింది. కొన్ని చోట్ల మంకుగా ఉన్నప్పటికీ, చాలా చోట్ల ఎండ కాచింది. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి చినుకులు పడ్డాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం వేకువజాము వరకు మోస్తరు వర్షం కురిసింది.

● సగటు వర్షపాతం 10.5 మి.మీ

జిల్లాలో సరాసరి 10.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పొదలకూరులో 69.2 మి.మీ, బోగోలులో 62.6 మి.మీ, సీతారామపురంలో 60 మి.మీ, బుచ్చిలో 57 మి.మీ, కావలిలో 48.4 మి.మీ, చేజర్లలో 37.4 మి.మీ, జలదంకిలో 37 మి.మీ, ఉలవపాడులో 28 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారంతో పోలిస్తే కొన్ని చోట్ల ఉధృతి తగ్గింది. అయినా ఇంకా కొన్ని గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు కొనసాగుతున్నాయి. జలదంకి మండలం చామదల గ్రామం వద్ద నేరెళ్ల వాగులో పడి ఓ వ్యక్తి గల్లంతయ్యాడు.

● సోమశిలకు కొనసాగుతున్న వరద

అనంతసాగరం : నాలుగు రోజులుగా సోమశిలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుతూ..పెరుగుతూ కొనసాగుతోంది. అయితే దిగువకు మాత్రం స్థిరంగా నీటిని విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం 32,232 క్యూసెక్కులు వస్తుండగా మధ్యాహ్నానికి 20,960 క్యూసెక్కులకు తగ్గింది. రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురుస్తుండగా మరో నాలుగు రోజుల వరద సాగవచ్చని ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 69.442 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● కండలేరులో నీటి నిల్వ 59.810 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 59.810 టీఎంసీలుగా ఉందని కండలేరు డ్యామ్ ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 2300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 3450 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

● నిండుతున్న చెరువులు

భారీ వర్షాలతో జిల్లాలోని చెరువులు నిండుతున్నాయి. ఇప్పటికే 60 శాతం మేర చెరువుల్లో నీరు నిల్వ ఉంది. జిల్లాలో మొత్తం 1007 చెరువులు ఉండగా, వాటిలో 122 చెరువులు పూర్తిగా నిండాయి. మరో 137 చెరువులు 75 శాతం వరకూ నిండగా, ఇంకో 230 చెరువుల్లో 50 శాతానికిపైగా నీరుంది. ఇంకా వరద వస్తుండడంతో ఒకటి, రెండు రోజుల్లో మరికొన్ని చెరువులు నిండే అవకాశమున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇటు ప్రజలు, అటు అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. అయితే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో శనివారం నుంచి వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి.

చివరి ఆయకట్టుకు నీరందిస్తాం : ఎమ్మెల్యే ఇంటూరి



అధికారులతో కలిసి రాళ్లపాడు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం : భారీ వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులోకి నీరు చేరినందున ఆయకట్టు చివరి వరకు సాగు నీరందిస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి ఇంటూరి నాగేశ్వర రావు చెప్పారు. గురువారం సాయంత్రం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టును సందర్శించారు. నీటిమట్టాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు రైతులకు నీరందించేందుకు కృషి చేయాలని, అలాగే నీటి సంఘాల అధ్యక్షులు అధికారులకు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పీ. గురునాథం, ఏలూరి వెంకటేశ్వర్లు, డీఈఈలు వెంకటేశ్వర్లు, శేషయ్య, ఏఈఈ మనోహర్ పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయి యువకుడి మృతి

జలదంకి : మండలంలోని చామదలకి చెందిన దంపూరు మల్లికార్జున(45) గురువారం ఉదయం 6 గంటలకు కావలికి వెళ్లేందుకు ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. బ్రాహ్మణక్రాక- బోగోలు ఆర్‌అండ్‌బీ రోడ్డు చప్టా దాటే క్రమంలో నేరేళ్లవాడు ప్రవాహం ఉధృతి పెరగడంతో వాహనంతో సహా కొట్టుకుపోయాడు. స్థానికుల సాయంతో యువకుడి కోసం గాలించారు. కానీ జాడ తెలియకపోవడంతో రెస్క్యూ బృందానికి సమాచారం అందించారు. పడవలపై వెళ్లి రెస్క్యూ టీం యువకుడి మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు.



మల్లికార్జున (ఫైల్)

● దెబ్బతిన్న చెరువుకట్ట

లింగసముద్రం : మండలంలోని ఆర్‌ఆర్ పాలెం చెరువు కట్ట భారీ వర్షాలకు దెబ్బతింది.గత వారం నుంచి కురుస్తున్న వర్షాలకు చెరువులోకి నీరు చేరింది.అయితే బుధవారం కురిసిన భారీ వర్షాలకు చెరువులోకి సామర్థ్యానికి మించి నీరు చేరి చెరువు కట్టపై నుండి నీరు పొంగి ప్రవహించింది.దీంతో చెరువు కట్టతో పాటు, అలుగు కూడా దెబ్బతింది.

పేకాట వ్యవహారంలో హోటల్ మేనేజర్‌పై కేసు

- హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి సస్పెన్షన్
- బెట్టింగ్ డాన్ కృష్ణసింగ్‌పై కఠిన చర్యలకు రంగం సిద్ధం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేకాట కేంద్రం నిర్వహణకు సహకరించిన హోటల్ మేనేజర్‌పై నగరంలోని చిన్నబజారు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నగరానికి చెందిన దేమునాయుడు కారుడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఆయన జల్సాలకు, వ్యసనాలకు బానిసై స్నేహితులతో కలిసి పెన్నానదిలో పేకాట ఆడుతూ ఆర్థికంగా నష్టపోయాడు. ఈ క్రమంలో పేకాట కేంద్రాలను నిర్వహించి డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకు పెద్దపెద్ద హోటళ్లను ఎంపిక చేసుకున్నాడు. నగరంలోని శోధన్‌నగర్‌లో గల ఓ ప్రముఖ హోటల్ మేనేజర్ రత్నంతో పరిచయం పెంచుకున్నాడు. హోటల్‌లో పేకాటకు అనుమతిస్తే కమీషన్ కింద రోజుకు రూ.2వేలు ఇస్తానని చెప్పడంతో మేనేజర్ అంగీకరించాడు. హోటల్‌లోని ఓ గదిని వారం రోజులుగా దేమునాయుడు తీసుకొని పేకాట కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం సీసీఎస్, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ సీతారామారావు, చిట్టెం కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి పేకాట కేంద్రంపై దాడి చేశారు. నిర్వాహకుడితోపాటు మరో 17 మందిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. నిర్వాహకుడిని తమదైన శైలిలో పోలీసులు విచారించగా హోటల్ మేనేజర్ పాత్ర గురించి తెలిసింది. దీంతో అతన్ని పోలీసులు అరెస్ట్ చేశారు.



● హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

హోటల్‌లో పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడిన విడవలూరు పోలీసుస్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జీకేఎస్ పుల్లారెడ్డిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన నగరంలోని శోధన్‌నగర్‌లోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడిన విషయం తెలిసిందే. క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయన్ను విధుల నుంచి తొలగించారు.

● బెట్టింగ్ డాన్‌పై కఠిన చర్యలు ?

బెట్టింగ్‌డాన్ కృష్ణసింగ్‌పై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కృష్ణసింగ్‌పై జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లలో అనేక కేసులు ఉండగా, దర్గామిట్ట స్టేషన్‌లో సస్పెక్ట్‌షీటు ఉంది. అయినా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. నెల వ్యవధిలో పేకాట ఆడుతూ రెండు సార్లు పోలీసులకు చిక్కాడు. దీంతో అతనిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తారన్న ప్రచారం సాగుతుంది. ప్రస్తుతం ఆయన చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో నివాసం ఉండటంతో సస్పెక్ట్‌షీటు చిన్నబజారు స్టేషన్‌కు బదిలీ కానుంది.

ఏపీ ఎస్పీడీసీఎల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్ ఏఈ, డిప్యూటీ ఈఈల సస్పెన్షన్

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎస్పీ డీసీఎల్ పరిధిలోని గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్‌లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న బీ మల్లికార్జున్, డిప్యూటీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న పీ శంకరయ్యలను సస్పెండ్ చేస్తూ ఏపీ ఎస్పీ డీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఉత్వర్వులు జారీ చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ కే గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్‌లో విద్యుత్ పరికరాల అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వారిని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు. అలాగే ఈ అంశంపై వివరణ కోరుతూ నెల్లూరు సర్కిల్ కార్యాలయంలో ఈఈ (టెక్నికల్)గా విధులు నిర్వహిస్తున్న ఎస్ బాలచంద్రకు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట 8

ఎల్‌ఆర్‌ఎస్‌కు ముగిసిన గడువు

- 30 నుంచి 35 శాతమే దరఖాస్తులు
- నేతల అండ ఉందనే ధీమా
- ముందుకురాని రియల్టర్లు
- ప్రభుత్వం మళ్లీ గడువు పొడిగించేనా?

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్ల, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్‌ఆర్‌ఎస్) గడువు గురువారంతో ముగిసింది. అయితే దరఖాస్తులు మాత్రం నామమాత్రంగానే వచ్చాయి. ఈ పథకానికి తొలినుంచి జిల్లాలో స్పందన అంతంత మాత్రంగానే ఉంది. భారీగా దరఖాస్తులు వస్తాయన్న పాలకులు, అధికారుల అంచనాలు తలకిందులయ్యాయి.



● మొక్కుబడిగానే దరఖాస్తులు

గత వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా అక్రమ లేఅవుట్లు వేసి, వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్దఎత్తున గండి పడడంతోపాటు, ప్లాట్లు కొన్నవారు ఇబ్బందులు పడుతూవచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. వ్యాపారులు, కొనుగోలుదారులు నష్టపోకుండా చర్యలు చేపట్టేందుకు, అలాగే ప్రభుత్వ ఆదాయాన్ని రాబట్టేందుకు ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి మూడు నెలల గడువు ఇస్తూ, ఈలోపు అక్రమ లేఅవుట్లు, అక్రమ ప్లాట్లు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. అయితే లేఅవుట్ల యజమానులు క్రమబద్ధీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. స్థానిక అధికారపార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల అండదండలు ఎక్కువమందికి ఉండడంతో, క్రమబద్ధీకరణకు పెద్దగా ముందుకు రాలేదు. ఈ విషయమై నియోజకవర్గాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో నుడా పరిధిలో కేవలం 30నుంచి 35శాతం మాత్రమే క్రమబద్ధీకరణకు లేఅవుట్ల, ప్లాట్ల యజమానులు ముందుకువచ్చారు. వీటిలో ఎక్కువగా ప్లాట్లకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా ఉన్నాయి. నుడా పరిధిలోని 8 నియోజకవర్గాల్లోని 31మండలాల్లో 427అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. వీటిని అధికారులు గుర్తించారు. అయితే క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినా పూర్తిస్థాయిలో ముందుకు రాలేదు. 427అక్రమ లేఅవుట్లు ఉండగా, గడువు ముగిసే సమయానికి 860మేర దరఖాస్తులు నుడాకు వచ్చాయి. 100మేర అక్రమ లేఅవుట్లు మాత్రమే క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 30నుంచి 35శాతం మాత్రమే దరఖాస్తులు నమోదైనట్లు నుడా అధికారులు తెలిపారు.

● మళ్లీ గడువు పొడిగించేనా... ?

ఎల్‌ఆర్‌ఎస్ గడువు ముగిసింది. ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందా...? గడువును పొడిగిస్తుందా...? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాలకులు సైతం వచ్చిన దరఖాస్తులుపై సంతృప్తి చెందకపోవడంతో గడువు పెంపునకు వారు కూడా కృషి చేస్తారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఇచ్చిన గడువులో పూర్తిస్థాయిలో అక్రమ లేఅవుట్ల యజమానులు క్రమబద్ధీకరణకు వచ్చిఉంటే ప్రభుత్వ ఖజానాకు రూ. కోట్లు జమఅయ్యే అవకాశం ఉండేది.

రేషన్ బియ్యం అక్రమాలు... అధికారులపై బదిలీ వేటు

- నెల్లూరు ఏఎస్‌వోగా వాణి
- ఇక్కడ పనిచేస్తున్న అంకయ్య పాడేరుకు..
- మాతృసంస్థకు డీఎస్వో ?

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రేషన్ బియ్యం వ్యవహారంలో సహాయ పౌరసరఫరాల అధికారు(ఏఎస్‌వో)లపై బదిలీ వేటు పడింది. నెల్లూరు డివిజన్‌లో ఏఎస్‌వోగా పనిచేస్తున్న డీ. అంకయ్యను అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నెల్లూరు ఏఎస్‌వో పీ. వాణిని నియమించారు. కావలి డివిజన్‌లో ఏఎస్‌వోగా పనిచేస్తున్న జే.రవిని అన్నమయ్య జిల్లా ఏఎస్‌వోగా బదిలీ చేస్తూ సివిల్ సప్లయిస్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

● మాతృశాఖకు డీఎస్వో ?

జిల్లాలో డీఎస్వోగా పనిచేస్తున్న విజయకుమార్‌ను మాతృశాఖ అయిన రెవెన్యూశాఖకు బదిలీ చేయాలని సూచించినట్లు సమాచారం. జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలతో వాస్తవాలను తెలుసుకోడానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్, సివిల్ సప్లయిస్ కమిషనర్, డీఎస్వో విజయకుమార్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ అర్జునరావులను ఇటీవల అమరావతికి పిలిపించారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని, కొందరు అధికారపార్టీ నాయకులే మాఫియా లీడర్లుగా వ్యవహరిస్తున్నారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ప్రెస్‌మీట్‌లో ఆరోపించడం, ఆ ప్రెస్‌మీట్‌లో సివిల్ సప్లయిస్ మంత్రి నాదెండ్ల పేరును కూడా ప్రస్తావించడంతో కూటమి ప్రభుత్వంలో దుమారం రేగింది.



● లారీలను వదిలిపెట్టారనే ఆరోపణలు

గతనెల 21న నెల్లూరు మూడోమైలు వద్ద ఉన్న సుభాన్‌నగర్‌లో ఐదు లారీల్లో 180 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఇందులో రెండు లారీలను రేషన్ బియ్యంగా గుర్తించి సీజ్ చేశారు. మూడు లారీల్లో సాధారణ బియ్యంగా గుర్తించి వదిలిపెట్టారు. ఈ విషయాన్ని కోటంరెడ్డి తప్పుపట్టారు. సివిల్ సప్లయిస్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి మూడు లారీలను వదిలి పెట్టారని, రేషన్ మాఫియా నాయకుడికి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణల నేపథ్యంలో అమరావతికి జిల్లాకు చెందిన డీఎస్వో, సివిల్ సప్లయిస్ డీఎంలను పిలిపించి వివరాలు సేకరించారు. గురువారం వారిపై సివిల్ సప్లయిస్ కమిషనర్ బదిలీ వేటు వేశారు.

26న మెగా రక్తదానశిబిరం

మనుబోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు ఉన్నతాధికారుల సూచన మేరకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శివరాకేష్ గురువారం తెలిపారు. స్థానిక సీఆర్ఆర్ కల్యాణమండపంలో జరిగే ఈ శిబిరంలో యువత, పెద్దలు అధికసంఖ్యలో రక్తదానం చేయాలని ఎస్ఐ కోరారు. రక్తదాతలకు డీఎస్పీ, ఎమ్మెల్యేలు ధృవీకరణపత్రాలు అందజేసి సత్కరిస్తారన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఐ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11901
వెండి కిలో ధర	రూ. 156400
వెండి ఒక గ్రాము	రూ. 162.40

నేడు కొమ్మలపూడిలో సోమిరెడ్డి పర్యటన

మనుబోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మలపూడి గ్రామానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం రానున్నారని ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని దళితవాడలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవస్థానం జీర్ణోద్ధారణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

పొంగి ప్రవహిస్తున్న నావూరు పెద్ద వాగు

● గ్రామాలకు రాకపోకలు బంద్

పొదలకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ చిన్నపాటి నిర్లక్ష్యం ఫలితంగా నాలుగు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. వర్షాలకు ప్రజా జీవనం అస్తవ్యస్తంగా మారింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని నావూరు పెద్దవాగు పొంగి పొర్లుతోంది. డైవర్షన్ రోడ్డుకు తూములు అమర్చకపోవడంతో డైవర్షన్ రోడ్డు కూడా వరదకు కొట్టుకుపోయింది. తూములు ఏర్పాటు చేసి వుంటే నీరు ప్రవహించేదని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం డైవర్షన్ రోడ్డులేక, బ్రిడ్జి నిర్మాణంలో ఉండడంతో రాకపోకలకు అవకాశం లేకుండా పోయిందన్నారు. గురువారం ఆయా గ్రామస్థులు నావూరు పెద్దవాగు వద్ద నిరసన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నావూరు చెన్నారెడ్డిపల్లి, బోగసముద్రం కొండలరాయుడు కండ్రిగకు రాకపోకలు స్తంభించిపోయాయని, ఇప్పటికైనా కాంట్రాక్టర్ పెద్ద తూములను అమర్చి డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు అలుపూరు శ్రీనివాసులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సర్కారు జాగా.. వేసెయ్ పాగా!

● ప్రభుత్వ స్థలాలు యథేచ్ఛగా ఆక్రమణలు

● గొలగమూడిలో రూ. కోట్ల విలువైన స్థలాలకు రక్షణ కరువు



గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమానికి సమీపంలో ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

వెంకటాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సర్కారు స్థలాల రక్షణను అధికారులు గాలికొదిలేశారు. దీన్ని అక్రమార్కులు అవకాశంగా తీసుకుంటున్నారు. ఎక్కడ ఖాళీగా స్థలం కనిపిస్తే అక్కడ వాలిపోతున్నారు. అంతేకాదు.. కబ్జా చేసేసి అక్కడ ఏకంగా నిర్మాణ పనులు ప్రారంభించారు. సర్కారు స్థలాలు పరాధీనమవుతున్నా అడిగే దిక్కు లేదు. మండలంలోని గొలగమూడి గ్రామంలోని సర్వే నెంబరు 54లో మొత్తం 3.39 ఎకరాల ప్రభుత్వ తోపు పోరంబోకు భూమి ఉండగా, గతంలో వెంకయ్యస్వామి ఆశ్రమానికి ప్రభుత్వం 30 సెంట్లు అప్పగించింది. కాగా 3.09 ఎకరాల భూమి మిగిలి ఉండగా గత కొన్నేళ్ల కిందటే కొందరు స్థానికులు రోడ్డుకు అనుకుని ఉన్న స్థలాలను ఆక్రమించడమే కాకుండా ఇల్లు కూడా నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. మరికొందరు దుకాణాలు పెట్టుకుని జీవిస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా ఖాళీగా ఉన్న స్థలాలను క్రయ విక్రయాలు కూడా చేశారు. ప్రస్తుతం గొలగమూడి బైపాస్ రోడ్డు పక్కనే వెంకయ్యస్వామి ఆశ్రమానికి సమీపంలో నెల్లూరుకు వెళ్లే ప్రధాన రహదారికి అనుకుని చాలా ఖాళీ స్థలం ఉండగా, అందులో 15 అంకణాల్లో నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ స్థలం విలువ రూ. కోట్ల రుపాయలు పలుకుతోంది.

● రీ సర్వేలో అడంగల్ మార్పు

గత వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వే జరగగా అందులో అడంగల్ రికార్డులను మార్చారు. కానీ డైక్లాట్ ప్రకారం నేటికి ప్రభుత్వ తోపు పోరంబోకు స్థలంగా ఉంది. రీ సర్వే జరగకముందు పాత అడంగల్ రికార్డుల్లో కూడా తోపు పోరంబోకు స్థలంగానే ఉండడం విశేషం. కాగా వైసీపీ ప్రభుత్వంలో కొందరు అక్రమార్కులు రీ సర్వే సాకు చూపెట్టి ఆ సర్వే నెంబరును అడంగల్ రికార్డుల్లో మార్చేశారు. రీ సర్వే తర్వాత అడంగల్‌లో గ్రామకంఠం, గ్రామ చావిడి, గ్రామనత్వంగా మార్చి ఇక్కడ నివాస గృహాలు ఉన్నాయని నమోదు చేశారు. దీనిని ఆసరాగా తీసుకున్న కొందరు అక్రమార్కులు ఖాళీగా ఉన్న రూ.కోట్లు విలువ చేసే ఆ స్థలాన్ని కాజేసి నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా నిర్మాణాలు సైతం మొదలుపెట్టేశారు. గొలగమూడిలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం ఉండడంతో స్థలాలకు అమితమైన ధరలున్నాయి. వీటిని పరిరక్షించాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. చివరకు రూ.కోట్ల రుపాయలు చేసే విలువైన ప్రభుత్వ స్థలాలు అక్రమార్కులపాలవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ స్థలాల దురాక్రమణపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని గొలగమూడి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ఇది పంచాయతీ స్థలమని రెవెన్యూ అధికారులు... కాదు.. ఇది రెవెన్యూ స్థలమే' అని పంచాయతీ అధికారులు పరస్పరం దాటవేస్తుండడం గమనార్హం. దీంతో అధికారుల తీరుపై గ్రామస్థులు మండిపడుతున్నారు. గొలగమూడిలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైందని స్థానికులు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, గ్రామస్థులు కోరుతున్నారు.

పార్కింగ్‌కు అప్పగించాలని డిమాండ్

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం దినదినాభివృద్ధి చెందుతూ ఉండడంతో.. భవిష్యత్తులో పార్కింగ్ అవసరాల నిమిత్తం ఆశ్రమానికి సమీపంలో ఉన్న ఈ స్థలంతో పాటు మరి కొంత స్థలాన్ని ఆశ్రమానికి అప్పగిస్తే ఎంతో అనువుగా ఉంటుందని భక్తులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ ఆ స్థలంలో పార్కింగ్‌కు కుదరకుంటే ఆశ్రమం తరఫున పార్కును ఏర్పాటు చేస్తే ఆహ్లాదంగా సౌకర్యంగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం



సంబంధిత స్థలానికి సంబంధించి రికార్డులు పరిశీలించి రిపోర్ట్ ఇవ్వాలని రెవెన్యూ శాఖను కోరాం. దీనిపై మాకు ఇంకా రిపోర్టు రాలేదు. వచ్చిన వెంటనే రికార్డులు పరిశీలించి తప్పనిసరిగా తగిన చర్యలు తీసుకుంటాం.

- షేక్ ముషీధర్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ

వర్షాల వేళ.. పరిశుభ్రత చర్యలు చేపట్టాలి!

మున్సిపల్ చైర్‌పర్సన్ సుప్రజ



ప్రజలను అప్రమత్తం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో బుచ్చి పురపాలక సంఘ పరిధిలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని బుచ్చి మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. గురువారం బుచ్చి పట్టణంలోని కార్మికుల మ స్టర్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. కాలువ ల్లో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం లేకుం డా చెత్తాచెదారం తొలగించి, వెంటనే బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. వర్షాలు తగ్గేవరకు అన్ని శాఖల సిబ్బంది అందుబాటులో వుండాలన్నా రు. భారీ వర్షాల నేపథ్యంలో 4వ వార్డు పరిధిలోని గుడపల్లి కాలువ పరిసర ప్రాం తాలను కమిషనర్ బాలకృష్ణ, సిబ్బందితో కలిసి చైర్‌పర్సన్ పరిశీలించారు. అప్రమత్తంగా ఉం డాలని ప్రజలకు సూచించారు. ఆయా ప్రాం తాల్లో సైడ్ డ్రైన్ల సమస్యలపై ప్రజలు ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారంతో మంజూరైన రూ.50 లక్షల నుడా నిధులతో వర్షాలు తగ్గిన వెంటనే కాలువలపై ఆర్‌సీసీ కాంక్రీట్ గోడల నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. ఏఈ వెంకటేష్, శానిటేషన్, వాటర్, విద్యుత్‌శాఖ మేస్త్రీలు వున్నారు.

రోడ్లు వేశారు... కాలువలు మరిచారు!

కొడవలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పాలకులు ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారు.. అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పి కష్టాలకు గురిచేస్తున్నారు. నిధులు ఉన్నాయని సిమెంటు రోడ్లు వేస్తున్నారు. వాటికి అనుసంధానంగా కాలువలు నిర్మించడం లేదు. దీంతో వర్షం నీరు ఇళ్లల్లో వృధా నీరు బయటకుపోక ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఈ దుస్థితి మండలంలో కొన్ని గ్రామాల్లో చోటు చేసుకుంది. మండలంలో మానేగుంటపాడు, కొత్తవంగళ్లు, కొడాకలూరు ఎన్టీఆర్ కాలనీ, గండవరం గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేశారు. వీటికి ఇరువైపులా మరుగు కాలువలు ఏర్పాటు చేయలేదు. ఎక్కడైనా రోడ్లు వేస్తే ముందుగా కాలువలు ఏర్పాటు చేస్తారు. ఈ అధికారులు మరిచి ప్రజలకు సమస్య మిగిల్చారు. మురుగునీరు బయటకు పోయే పరిస్థితి లేదు. వ్యాధుల బారినపడుతున్నామని ప్రజలు భయాందోళనలకు గురవుతారని తెలిపారు. ఇంకనైనా అధికారులు స్పందించి వెంటనే సైడ్ కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పొదలకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిపల్లి పొలాల్లో పేకాట ఆడుతున్న వారిని ఎస్పీకి సమాచారం అందడంతో ఎస్పీ ఆదేశాలతో పొదలకూరు పోలీసులు ఆకస్మిక దాడి చేసి 8 మంది పేకాటరాయుళ్లను గురువారం అరెస్టు చేశారు. సీఐ శివరామకృష్ణారెడ్డి కథనం ప్రకారం మర్రిపల్లి పొలాల్లో పలువురు పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో తాము అక్కడికి చేరుకుని దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో 8 మందిని అరెస్టు చేసినట్లు చెప్పారు. రూ.46,500 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పార్టీలకు అతీతంగా యూరియా పంపిణీ

వెంకటాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతుల విషయంలో రాజకీయాలకు తావు లేకుండా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి యూరియా పంపిణీ చేస్తున్నట్లు చవటపాళెం పీఏసీఎస్ చైర్మన్ రావూరి రాధాకృష్ణమ నాయుడు తెలిపారు. వెంకటా చలంలోని సొసైటీ కార్యాలయంలో గురువా రం రైతులకు యూరియాను పంపిణీ చేశా రు. ఆయన మాట్లాడుతూ రైతు పక్షపాతిగా పేరుగాంచిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రైతుల విషయంలో ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల కు ఎలాంటి ఇబ్బంది లేకుండా కృషి చేస్తు న్నారన్నారు. ప్రతి రైతుకు ఎకరాకు 3 బస్తాల యూరియాను అందిస్తున్నామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను ప్రతి ఒక్క రైతు ఖచ్చితంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ చల్లా నాగార్జున్‌రెడ్డి, చవటపాళెం సొసైటీ డైరెక్టర్ ఆస్తోటి నాగరాజు, అగ్రికల్చర్ ఏఓ హరికరుణాకర్‌రెడ్డి, సొసైటీ సీఈఓ రవిచంద్ర, నేతలు బత్తల రాఘ రామయ్య. నండి రమణయ్య, రమేష్, రామ్ ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ నీరు.. ఇంట్లోకి!



ఇంట్లో చేరిన డ్రైనేజీ నీరు

పొదలకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. పొదలకూరు పట్టణంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఓ ఇంట్లోకి డ్రైనేజీ కాలువలోని నీరు చేరింది. పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. కాలువల్లోకి చేరిన వాన నీరంతా ఇంట్లోకి చేరి దుర్వాసన వెదజల్లుతోందని, పంచాయతీ అధికారులే పట్టించుకోకపోతే ఇంక ఎవరికి చెప్పాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు మొత్తం డ్రైనేజీ కాలువ వర్షపు నీరు చేరింది. తమ బాధ వర్ణనాతీతమని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారుల స్పందించి కాలువ వర్షపు నీటిని బయటకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు.

కోవూరు చేరిన యూరియా



యూరియాను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కోవూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పడుగుపాడు రైల్వే స్టేషన్‌కు వ్యాగిన్ల ద్వారా 2600 మెట్రిక్‌టన్నుల నర్మద యూరియా చేరింది. వ్యాగిన్ల నుంచి యూరియా లారీల్లో తరలిస్తుండగా జిల్లా వ్యవసాయాధికారిణి సత్యవాణి పరి శీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని రైతాంగానికి ప్రభుత్వం 1580 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించింద న్నారు.1020 మెట్రిక్ టన్నుల యూరియాను తిరుపతి జిల్లాకు తరలిస్తున్నామన్నారు.యూరియాను జిల్లా లోని పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. ఆమె వెంట వ్యవసాయాధికారులు అనిత, రజని తదితరులున్నారు.

కాలువ తవ్వకం

అనంతసాగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి ఎస్సీ కాలనీలో వర్షపునీరు చేరి ప్రజలు అవస్థలు పడుతుండగా సమస్యను గుర్తించిన తెలుగు రైతు మండల అధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్ రెడ్డి తన సొం త నిధులు వెచ్చించి ఎక్స్‌కవేటర్‌తో ప్రత్యేక కాలువ తవ్వించారు. దీంతో వర్షపు నీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఎడతెరిపి లేని వర్షంతో ప్రజల అవస్థలు

ఆత్మకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాగా, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే ఆదుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్డీవో బీ పావని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

ఉదయగిరి, (ఆంధజ్యోతి): అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి గురువారం విలేఖరులతో మాట్లాడుతూ అన్నారు.

అటవీశాఖ అభ్యంతరాలు తగదు

● సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతామన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కండలేరు జలాశయం స్పిల్ వే విషయంలో అటవీశాఖ అభ్యంతరాలు తగదని, ప్రజా ప్రాణాలు కంటే మరేది ముఖ్యంకాదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కండలేరు జలాశయంలోని స్పిల్‌వేను పరిశీలించి ఇరిగేషన్ ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డ్యాం ఈఈ గజేంద్రరెడ్డి, డీఈ శివారెడ్డి, తహసీల్దారు శివకృష్ణ తదితరులతో వరద పరిస్థితిపై చర్చించి పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ స్పిల్‌వే వద్ద అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడామన్నారు. భారీ వర్షాలతో కండలేరు జలాశయం నిండుకుండలా మారింద ని, 68 టీఎంసీల సామర్థ్యం కలిగిన కండ లేరులో ఇప్పటికే నిల్వ 60 టీఎంసీలు దా టిందన్నారు. పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కొనసాగితే స్పిల్ వే గేట్లు తెరవక తప్పని పరిస్థితి ఏర్ప డుతుందన్నారు. గేట్లు తెరిస్తే వరద జలాలు ఇక్కడి నుంచి 14 కిలోమీటర్లు మేర ప్రవహించి దేగపూడి వద్ద కండలేరు వాగులో కలవాలన్నారు. స్పిల్ వే దిగువ ప్రాంతంలో 560 మీటర్ల మేర అటవీ భూమి ఉందని కాలువ త వ్వేందుకు అటవీ భూమి ఉందని కాలువ తవ్వేందుకు అటవీశాఖ అభ్యంతరం చెబుతోందన్నారు. ఇప్పటి వరకు జరిగిన పనులు కాకుండా వరద నీరు సాఫీగా వెళ్లి కండలేరు వాగులో కలిసేందుకు కొత్తగా రూ.95 కోట్లతో పనులు చేపట్టాల్సి వుంద న్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ సమస్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. రూ.95 కోట్ల ప్రతిపాదనలను సీఎం చంద్ర బాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. అటవీ శాఖకు 560 మీటర్ల మేర భూ మికి ప్ర త్యామ్నాయంగా ఉదయగిరిలో భూములు చూపించారన్నారు. ప్రతి విషయంలో ని యమ నిబంధనల పేరుతో అటవీశాఖ అ డ్డు తగలడం సరికాదన్నారు. కాలువ తవ్వి తే నీళ్లు సాఫీగా దిగువకు వెళ్లిపోతాయి. లేదంటే అటవీ ప్రాంతం కూడా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడటమేగాక రైతుల పొలాలు కూడా మునిగిపోయే పరిస్థితి ఉందన్నారు. పులికల్లు, పర్వతాపురం, అం కుపల్లి, ఉసవల్లి, వావింటపర్తి, తదితర గ్రామాలు ప్రమాదంలో పడతాయన్నారు. డీ ఎఫ్ఓల నుంచి రాష్ట్ర ఉన్నతాధికా రుల వరకు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని కాలువ తవ్వకానికి అనుమతులు ఇవ్వాల న్నారు. ఇక్కడి ప్రజల అవసరాలను సీ ఎంకు వివరించి రూ. 95 కోట్లు మంజూరు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీ పీ నాయకులు బొమ్మి సురేంద్ర, పొద లకూరు పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మ స్తాన్ బాబు, బొద్దులూరు మల్లికా ర్జున నాయుడు, పులిపాటి వెంకట రత్నం నా యుడు, నెట్టెం పెంచలయ్య, కోడూరు పెం చల భాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, హరేంద్‌రెడ్డి, అలుపూరు శ్రీనివాసులు,పాల్గొన్నారు.

మండలంలో 3085 బస్తాల యూరియా సిద్ధంగా ఉందని, ప్రతి రైతుకు ఎకరాకు మూడు బస్తాల చొప్పున అందిస్తామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తా న్ బాబు ఆధ్వర్యంలో ఆర్ వైపాలెం రైతు సేవా కేంద్రం లోని రైతులకు యూరియా పంపిణీ చేశారు. రైతులు యూరియాను పరిమి తంగా వాడాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటించాలన్నారు.

C.R.I.M.E N.E.W.S

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ హరిచందన ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై బులుగు రంగు గళ్ల ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, మెరూన్ రంగు డిజైన్ లుంగీ ఉన్నాయి. 55-60 మధ్య వయసు ఉంటుంది. ఇతర ఆధారాలేవీ లభించకపోవడంతో ఎస్ఐ కేసు నమోదు చేసి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ...

నెల్లూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దంపతుల ఆత్మహత్యాయత్నంలో భర్త మరణించగా చికిత్స పొందుతున్న భార్య కూడా మరణించినట్లు రూరల్ సీఐ గుంజి వేణు గురువారం తెలిపారు. గుడిపల్లిపాడులో నివసించే దేవిరెడ్డి మురళీరెడ్డి, ఆయన భార్య జలజ (46) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం విదితమే. ఆ రోజే మురళీరెడ్డి మృతిచెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జలజ కూడా మరణించినట్లు తమకు సమాచారం అందగా గురువారం పంచనామా నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఇప్పటికే ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు...

మనుబోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈగ సాయికుమార్ (22) అనే యువకుడు మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిడూరు మిక్స్‌డ్ కాలనీలోని ఈగ సాయి కుమార్ అనే గిరిజన యువకుడు సెంట్రింగ్, వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. స్వస్థలంలో ఇల్లు కట్టుకునేందుకు పలుచోట్ల అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు ఓ ఫైనాన్స్‌లో ఇంటిని తాకట్టుపెట్టి తల్లిపేరిట రుణం తీసుకున్నాడు. నెలవారీ కంతులు చెల్లించకపోతే ఫైనాన్స్ నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తారన్న మనస్తాపంతో 14వ తేదీన సాయికుమార్ గడ్డి మందు తాగాడు. అప్పటినుండి నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ...

కావలి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందిన సంఘటన గురువారం కావలి పట్టణ ఉత్తర శివారులో జరిగింది. లోకో పైలెట్ ఫిర్యాదుతో జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. గోదుమ రంగు చొక్కా, నలుపు రంగు లుంగీ, టవల్ ధరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9440627648 నెంబరుకు సమాచారమివ్వాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కే వెంకట్రావ్ తెలిపారు.

విద్యుదాఘాతానికి గేదెల మృతి

● విద్యుత్ సిబ్బందిపై ఫిర్యాదు

చేజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదెలు మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పూర్తి వివరాల మేరకు... చేజర్లకు చెందిన ఎం శారద అనే మహిళ గురువారం గ్రామ సమీపంలో ఉన్న కౌలుకు తీసుకున్న తోటకు మేత కోసం గేదెలను తోలుకుని వెళుతుండగా ఎస్‌టి కాలనీలో ఉన్న తాగునీటి బోరుకు పోయే విద్యుత్ లైన్‌కు సంబంధించిన తీగ తెగి పొలంలో పడి ఉంది. దీంతో అటుగా వెళ్ళిన 10 గేదెలలో 5 గేదెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు నాలుగు లక్షల రూపాయల విలువచేసే గేదెలు విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాయని శారద ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం విద్యుత్‌శాఖ సిబ్బందిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బ్యాంకు కాలనీలో బంగారం, వెండి చోరీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బీవీ నగర్ బ్యాంక్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. బ్యాంకు కాలనీలో జీ ప్రియాంక, హరీష్ దంపతులు నివసిస్తున్నారు. ప్రియాంక పొదలకూరురోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలు. ఆమె భర్త ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి దంపతులు ఇంటి తలుపునకు గడియపెట్టడం మరిచిపోయి నిద్రపోయారు. 19వ తేదీ తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో హరీష్ మంచినీళ్లు తాగేందుకు లేచి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 51 గ్రాములకు పైగా బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. బాధితురాలు గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుడిని బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు అని కూడా చూడకుండా కత్తితో చంపుతానని ఓ రౌడీషీటర్ బెదిరించి నగదు దోచెకెళ్లిన ఘటన నెల్లూరులోని మెక్లిన్స్ రోడ్డులో చోటు చేసుకుకుంది. కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డులో నివసించే దివ్యాంగుడు హయత్‌బాషా గురువారం సైకిల్‌పై తన అన్న గౌస్‌బాషా ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రౌడీషీటర్ సుల్తాన్ అడ్డగించాడు. రూ.వెయ్యి నగదు ఇవ్వాలని లేకుంటే చంపుతానని కత్తితో బెదిరించాడు. భయపడిపోయిన హయత్‌బాషా తన జేబులోని రూ.500 నగదు సుల్తాన్‌కు ఇచ్చాడు. దీంతో సుల్తాన్ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రావెల్ బస్సు

మనుబోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జాతీయరహదారిపై కొండూరు సత్రం క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. చెన్నై నుంచి ఆత్మకూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ఆత్మకూరుకు వెళుతుండగా సత్రం క్రాస్ రోడ్డు సమీపంలో ఒక్కసారిగా రోడ్డుపైకి ఆవులు గుంపుగా రావడంతో డ్రైవర్ సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వేగంగా వస్తున్న బెంగళూరు-నెల్లూరు ట్రావెల్ బస్సు ఆత్మకూరు బస్సు వెనుకభాగాన ఢీకొంది. దీంతో ట్రావెల్‌బస్సు ముందుభాగం సుమారుగా దెబ్బతినింది. అయితే ట్రావెల్‌బస్సులో ప్రయాణీకులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆత్మకూరు బస్సులోని ప్రయాణీకులను మరో బస్సులో ఎక్కించి పంపారు. కొమ్మలపూడి నుంచి మనుబోలు వరకు ఎక్కువగా గేదెలు, ఆవులు రోడ్డుపైకి రావడంతో గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. దీనిపై పోలీసులు, ఐజేఎం అధికారులు స్పందించి రోడ్డుపైకి ఆవులు, గేదెలు రాకుండా చర్యలు తీసుకోవాలని హైవే ప్రయాణీకులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 560



పనికి దూరమైన చేనేతలను ఆదుకోవాలి

నెల్లూరు రూరల్, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా పనికి దూరమైన చేనేత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పముజుల హరి కోరారు. నెల్లూరు రూరల్లోని సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాల్లోని చేనేత కార్మికులను ఆయన గురువారం పరామర్శించారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామాలలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి తెలియపరిచి చేనేతలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిత భారత వీవర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటసుబ్బయ్య, జక్కుల వెంకటేశ్వర్లు, మణి పాల్గొన్నారు.

పేరుకుపోతున్న ట్రేడ్

- వసూళ్లపై శ్రద్ధ చూపని యంత్రాంగం
- కార్పొరేషన్ ఖజానాకు భారీ నష్టం
- కదలనంటున్న మొండి బకాయిలు
- వైద్యశాలల నుంచే రూ. 4 కోట్లకుపైగా పెండింగ్

నెల్లూరు నగర పాలక సంస్థకు ఆదాయం తెచ్చిపెట్టే అతిపెద్ద వనరుల్లో రెండోది ట్రేడ్ లైసెన్సులు. వీటిని వాణిజ్య సంస్థల నుంచి వసూలు చేసి కార్పొరేషన్ ఖజానాకు జమ చేయడంలో మున్సిపల్ యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతోంది. ఇప్పటికీ రూ.18.19 కోట్లు వసూలు కావాల్సి ఉండగా అందులో నగరంలోని వైద్యశాలల నుంచే రూ. 4 కోట్లపైనే నగర పాలికకు జమ కావలసి ఉంది. కాగా, ట్రేడ్ లైసెన్సులు విధించిన సుమారు 7 వేల షాపులు ప్రస్తుతం కనిపించకపోగా వాటి నుంచి రావాల్సిన దాదాపుగా రూ. 5 కోట్ల బాకీ ప్రశ్నార్థకంగా మారింది. కార్పొరేషన్ ఆరోగ్య విభాగంలో ఇప్పటి వరకు పనిచేసిన అధికారులు ట్రేడ్ లైసెన్సు ఫీజు వసూళ్లపై శ్రద్ధపెట్టకపోవడంతోనే ఇలా రూ.కోట్ల బకాయిలు పేరుకుపోయాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నెల్లూరు(సిటీ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలో వాణిజ్య పరమైన ఏ సంస్థ ఏర్పడిన కార్పొరేషన్ నుంచి ఎన్‌వోసీతోపాటు పారిశుధ్య ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సు పొందాల్సి ఉంటుంది. చిన్న బడ్డీకొట్టు నుంచి మాల్స్ వరకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఈ క్రమంలో నగరంలో 13,090 వరకు వ్యాపార నిర్మాణాలున్నాయని ఆరోగ్య విభాగం లెక్కకట్టింది. వీటి ద్వారా ఏటా రూ. 35.68 కోట్ల వరకు కార్పొరేషన్ ఖజానాకు ఆదాయం సమకూరాల్సి ఉంది. అందులో రూ. 17.49 కోట్లు ఇప్పటికే వసూలు చేశారు. మిగిలిన రూ. 18.19 కోట్లను వసూలు చేయాల్సింది ఉంది. కాగా, నగర వ్యాప్తంగా 7 వేల షాపులు ట్రేడ్ లైసెన్సుకు అర్హత కలిగిన ఉన్నట్లు గతంలో అధికారులు గుర్తించారు. కానీ ప్రస్తుతం అవి నడవటం లేదని, వాటి ద్వారా తాజాది, పాతది కలిపి సుమారుగా రూ. 5 కోట్ల వరకు బాకీ ఉంటుందని గణించారు. అయితే ప్రస్తుతం ఆ దుకాణాలు లేనందున వాటి నుంచి బకాయిలు వచ్చే అవకాశ లేదు. అయితే ఇప్పటి వరకు అంత మొత్తంలో ఉన్న బకాయిలు ఎందుకు వసూలు చేయలేదన్నది ప్రశ్నార్థకం. ప్రస్తుతం మాయమైన ఈ షాపుల తాలూకు ట్రేడ్ నగదును గతంలోనే ఎవరైనా వసూలు చేశారా...?, లేక వదిలేశారా...?, వసూలు చేస్తే నగర పాలికకు ఎందుకు జమ చేయలేదు...? వంటి అనేక ప్రశ్నలు ఆరోగ్య విభాగాన్ని చుట్టుముడుతున్నాయి.

● వైద్యశాలల నుంచే రూ. 4 కోట్లకుపైగా...

నగరంలోని ఆసుపత్రులు, క్లినిక్‌ల నుంచి భారీగా ట్రేడ్ ఫీజు పెండింగ్ ఉంది. ఇప్పటికే ట్రేడ్ వేసిన సుమారు 4 వేల హస్పిటళ్లు, క్లినిక్‌లు నుంచి రూ. 4 కోట్లకుపైనే నగదు వసూలు కావాల్సి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇటీవల కార్పొరేషన్‌లో వైద్యుల సంఘం ముఖ్యులతో సమావేశం నిర్వహించినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని సమాచారం. తాజాగా 4,855 హస్పిటళ్లను గుర్తించిన ఆరోగ్య విభాగం అధికారులు వాటిల్లో 2,313 హస్పిటళ్లకు ట్రేడ్ లైసెన్సు విధించారు. బకాయిల విషయమై ఇప్పటికే నోటీసులు జారీ చేసిన అధికారులు, ఇచ్చిన గడువు ముగియగానే చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా భారీగా పేరుకుపోయిన ట్రేడ్ ఫీజును ఒక్కసారిగా కట్టమంటే తామెలా కట్టాలని కొందరు వైద్యులు ప్రశ్నిస్తున్నారు. మొండి బకాయి కాకముందే వసూలు చేయవచ్చు కదా.. అని పేర్కొంటున్నారు.

4 వేల ఆసుపత్రులు గుర్తించా...

ప్రతీ వాణిజ్య నిర్మాణం నుంచి కార్పొరేషన్‌కు ట్రేడ్ ఫీజు రావాల్సిందే. నేనొచ్చాక నగరంలోని 4 వేల హస్పిటళ్లను గుర్తించి అందులో సగానికిపైగా ట్రేడ్ వేశాను. మరో సుమారు రూ.కోటి వరకు ట్రేడ్ వసూళ్లు చేసి ఖజానాకు జమ చేశాము. మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చాము. వారు స్పందించకపోతే తదుపరి చర్యలుకు దిగుతాము.



- డాక్టర్ కనకాద్రి, ఎంహెచ్‌వో

ఇంటర్వ్యూ



బీసీ హాస్టళ్లలో ఆధునిక వసతులు

● నెల్లూరు డివిజన్ సహాయ బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఆధునిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. హాస్టళ్ల మరమ్మతులకు రూ.72 లక్షలను ప్రభుత్వం మంజూరు చేయటంతో అవి మరమ్మతులకు నోచుకున్నాయి. స్వచ్ఛ మరుగుదొడ్డను ఏర్పాటు చేయటం కోసం ప్రభుత్వం తాజాగా నిధులు మంజూరు చేసింది. దీంతో నిర్దేశిత హాస్టళ్లలో స్వచ్ఛ మరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు డివిజన్‌లో మంజూరైన స్వచ్ఛ మరుగుదొడ్లు, వసతుల కల్పన గురించి నెల్లూరు డివిజన్ సహాయ బీసీ సంక్షేమాధికారి మాకిరెడ్డి శ్రీదేవి ఆంధ్రజ్యోతికి వివరించారు.

? : నెల్లూరు డివిజన్‌లో బీసీ సంక్షేమ హాస్టళ్లు ఎన్ని ఉన్నాయి.

! : 17 బీసీ సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 10 ప్రీ మెట్రిక్, 6 పోస్టు మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో 1200 మంది విద్యార్థులు చదువుతున్నారు.

? : హాస్టళ్లకు స్వచ్ఛ మరుగుదొడ్లు మంజూరయ్యాయా..

! : డివిజన్‌లోని 12 బీసీ సంక్షేమ హాస్టళ్లకు స్వచ్ఛ మరుగుదొడ్లు మంజూరయ్యాయి. వీటిలో 8 కోవూరుకు, 4 వెంకటాచలం మండలానికి మంజూరయ్యాయి. ఆధునిక వసతులతో కూడిన ఈ స్వచ్ఛ మరుగుదొడ్లను త్వరలో ఆయా మండలాల హాస్టళ్లలో ఏర్పాటు చేయనున్నారు. ఒక్కొక్క స్వచ్ఛ మరుగుదొడ్డికి రూ. 3 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది.

? : డివిజన్‌లో హాస్టళ్లకు మరమ్మతులు జరిగాయా?

! : ప్రభుత్వం నిధులు మంజూరు చేయటంతో డివిజన్‌లోని హాస్టళ్ల మరమ్మతులు జరిగాయి. టాయిలెట్లు, తలుపులు, కిటికీలు, శ్లాబుల మరమ్మతులు చేశారు. గతంలో ఉన్న ఇబ్బందులు ఇప్పుడు లేవు.

? : ఫైన్ రైస్ భోజనం విద్యార్థులకు పెడుతున్నారా..

! : హాస్టల్ విద్యార్థులకు ఫైన్‌రైస్ భోజనం పెడుతున్నాం. ఇడ్లీ, పొంగలి, ఉప్మా వంటి అల్పాహారంతో పాటు, వెజిటబుల్ పలావ్, చికెన్, కోడిగుడ్డు, అరటి పండ్లు తదితరాలను కూడా వడ్డిస్తున్నాం.

? : సీజన్ జ్వరాల విషయంలో తీసుకున్న జాగ్రత్తలు

! : హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు జ్వరాలు రాకుండా వేడినీరు అందిస్తున్నాం. డాక్టర్లతో పరీక్షలు చేయించి, జ్వరాలు రాకుండా ముందస్తుగా అన్నీ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. జ్వర సమాచారం వచ్చిన వెంటనే హాస్టల్‌కు డాక్టర్‌ను పిలిపించిగాని, లేదా విద్యార్థిని డాక్టర్ వద్దకు తక్షణమే తీసుకెళ్లి వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాం.

? : విద్యార్థులకు ముఖ హాజరు అమలు చేస్తున్నారా...

! : చేస్తున్నాం. ప్రతి రోజూ విద్యార్థుల నుంచి ముఖ హాజరు తప్పని సరిగా తీసుకుంటున్నాం.

? : హాస్టళ్లలో ఆర్‌వో ప్లాంట్లు ఉన్నాయా..

! : అన్నీ బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఆర్‌వో ప్లాంట్లు ఉన్నాయి. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందచేస్తున్నాం. వసతులతో పాటు వారి బాగోగులను ఎప్పటికప్పుడు చూసుకుంటున్నాం.

కార్తీక మాసోత్సవాలను

విజయవంతం చేద్దాం

● సమన్వయ సమావేశంలో ఆర్డీవో అనూష



మాట్లాడుతున్న ఆర్డీవో అనూష, పక్కన అధికారులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్తీక మాసోత్సవాలను విజయ వంతం చేయాలని నెల్లూరు ఆర్డీవో అనూష కోరారు. గురువారం మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక మాసం ఏర్పాట్లపై అన్నీ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. శాఖలవారీగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె సమీక్షించి పలు సూచనలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ముఖ్య అర్చకుడు వందవాసి శివకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మహా దీపోత్సవం

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని గణేష్ ఘాట్‌లో నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా మహా దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు తనవంతు సహకారం అందిస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం గణేష్ ఘాట్‌లో కార్తీక మహా దీపోత్సవ ఏర్పాట్లను సింహపురి కార్తీక దీపోత్సవ సమితి సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. 108 పడవలతో శివలింగాకృతికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. నవంబరు 5వతేదీ సాయంత్రం 5గంటలకు మహిళలతో శోభాయాత్ర జరుగుతుందని, నగరంలోని మహిళామణులు అందరూ తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల, ప్రధాన కార్యదర్శి మల్లిక, ఉపాధ్యక్షురాలు జయప్రద, కార్యనిర్వాహక అధ్యక్షుడు కోడూరు జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాస ప్రవచనాలు ప్రారంభం



వెంకటేశ్వర రావును సత్కరిస్తున్న పద్య సారస్వత పరిషత్ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రేబాలవారి వీధిలో ఉన్న రాజ్ టవర్స్‌లో పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో కార్తీక మాస ప్రవచనాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రవచనాలు ఈనెల 29వ తేదీ వరకు ప్రతీరోజు సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్తీ క మాస విశిష్టతను డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు వివరించారు. సూరం చంద్ర శేఖరం, పోలవరపు లక్ష్మీనరసింహారావు, కొండేపి మురళీకృష్ణ, కోటం శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అయ్యప్ప దీక్షా ధారణ

నగరంలోని అయ్యప్ప గుడిలో కార్తీక మాసం సందర్భంగా అయ్యప్ప దీక్ష ధారణ పెద్ద సంఖ్యలో జరుగు తోంది. రెండు రోజుల్లో వెయ్యి మందికి పైగా భక్తులు దీక్ష తీసుకున్నారని ఆలయం చైర్మన్ జీ శేషగిరిరావు తెలిపారు. అయ్యప్ప భక్తులకు గురువారం మధ్యాహ్నం నుంచి అన్నదానం ప్రారంభించామని చెప్పారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శికి శుభాకాంక్షలు



ఈశ్వరయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీపీఐ జిల్లా నాయకులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన గుజ్జుల ఈశ్వరయ్యను ఆ పార్టీ జిల్లా నాయకులు గురువారం విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతా నికి, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయక కార్యదర్శి యామాల మధు, కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, సురేష్‌బాబు, శంకర్‌కిశోర్ పాల్గొన్నారు.

జీజీహెచ్ రోగుల చికిత్సలపై సమీక్ష



జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశంలో సూపరింటెండెంట్ మాధవి, కమిటీ సభ్యులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆసుపత్రిలో రోగులకు మెరుగైన చికిత్సలు అందించడంపై చర్చించారు. పారిశుధ్యం, భద్రతా చర్యలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలుపై కూడా చర్చ జరిగింది. అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు అబిదా సుల్తానా, బ్రహ్మారెడ్డి, మల్లికార్జున, మొగరాల సురేష్ పాల్గొన్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు



వరికుంటపాడు: పిల్లాపేరు వాగు వద్ద తహసీల్దారు, ఎస్ఐ

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలో బీరాపేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుంచి బీరాపేరు వాగులో సుమారు 30వేల క్యూసెక్కులకు పైగా ప్రవహిస్తున్నాయి. దీంతో పెరమన వద్ద బీరాపేరు వంతెనపై అడుగులోతు నీటి ప్రవాహం ప్రవహిస్తోంది. పెరమన గ్రామస్థులు మండల కేంద్రానికి రావాలంటే బీరాపేరు వాగు దాటాల్సిందే. వంతెన ఉన్నా దానిపై నీరు ప్రవహిస్తుండడంతో తప్పని పరిస్థితుల్లో గ్రామస్థులు వాగు నీటిలోనే ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. సమా చారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి పరిస్థితిని పరిశీలించి గ్రామస్థులెవరూ వాగు దాటవద్దని సూచిం చారు. దీంతో పెరమనకు రాకపోకలు నిలిచిపోయాయి.

● వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): ఎడతెరిపి లేని వర్షాల తాకిడికి వాగులు, వంకలు వరద నీటితో జలకళను సంతరించుకున్నాయి. కనియంపాడు-రామదేవులపాడు గ్రామాల సమీపంలోని పిల్లాపేరు వాగులోకి ఆశించిన మేర నీరు చేరడంతో వంతెనపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తహసీల్దారు హేమంత్ కుమార్, ఎస్ఐ రఘునాథ్ గురువారం హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తాత్కాలికంగా రాకపోకలను నిలిపివేశారు. అధికారికంగా ప్రకటించే వరకు వంతెనపై ప్రయాణించొద్దని ఆదేశించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● డీఎంహెచ్‌వో సుజాత

కలువాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో అందరూ అప్రమత్తంగా ఉండా లని వైద్య ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌వో సుజాత సూచిం చారు. గురువారం ఆమె కలువాయి పీహెచ్‌సీని ఆకస్మిక ంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఫీవర్ సర్వే నిర్వహించి అవసరమైన అత్యవసర మందులు అన్నీ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్యం పరిశీలించి బ్లీచింగ్ చల్లాలని ఆమె సూచించారు.



కలువాయి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, వైద్య ఆరోగ్య సిబ్బంది

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు

● టీడీపీ కార్యకర్తలతో మున్సిపల్ మంత్రి నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి పనిచేసే వారికి తెలుగుదేశం పార్టీలో తగిన గుర్తింపు ఉందని రాష్ట్ర పుర పాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గురువారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలు తెలుసుకోవాలని డివిజన్ ఇన్‌చార్జులకు సూచించారు. కమిటీల నియామకంపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, విజేత రెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో అనుమతులు లేకుండా నిర్మించిన పలు కట్టడాలను సిటీప్లానింగ్ అధికారులు నేలమట్టం చేస్తున్నారు. ఇది కొన్ని రోజులుగా కొనసాగుతూనే ఉంది. తాజాగా గురువారం వాహబ్‌పేటలోని మురుగు కాలువ ఆక్రమించి నిర్మించిన మెట్లు, ర్యాంపులను తొలగించారు. అనంతరం పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులను కమిషనర్ నందన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మురుగు కాలువల్లో పూడికతీత వేగంగా తీసి నీళ్లు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అవినీతికి పాల్పడితే ఊరుకోను

● పలు శాఖల అధికారులపై రూరల్ ఎమ్మెల్యే ఆగ్రహం



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మీరంతా అవినీతికి పాల్పడుతుంటే చూస్తూ ఊరుకోను...! అంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పలు ప్రభుత్వ శాఖల అధికారులపై మండిపడ్డారు. నగరంలోని ఆయన కార్యాలయంలో కార్పొరేషన్‌లోని సిటీప్లానింగ్, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో గురువారం సమీక్ష జరిపారు. కొందరు అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువస్తే సహించేది లేదని హెచ్చరించారు. కొందరు అధికారుల అవినీ తి చిట్టాను బట్టబయలు చేశారు. దీంతో సమీక్ష సమావేశంలో నిశ్శబ్దం అలుముకుందని తెలిసింది.

కాగా, తమ అపార్టుమెంట్ వద్ద వర్షపు నీరు చేరి నడవడానికి ఇబ్బందిగా ఉందని నగరంలోని ఏసీ స్టేడియం పరిసర ప్రాంత ప్రజలు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి గురువారం ఫోన్ చేసి చెప్పారు. వెంటనే స్పందించిన ఆయన టీడీపీ నేత గిరిధర్‌రెడ్డిని కార్పొరేషన్ అధికారులతో ఆ ప్రాంతానికి పంపారు. నిల్వ చేరిన నీటిని పక్కనే ఉన్న కాలువలోకి మళ్లించారు. వర్షాల నేపథ్యంలో పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలని గిరిధర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి, చక్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో డిప్యుటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పల్లిపాడు ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ(డైట్) కళాశాలలో డిప్యుటేషన్‌పై పనిచేసేందుకు ఐదేళ్ల అనుభవం కలిగిన ఎస్‌జీటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ లెక్చరర్ ఇన్ టీచర్ ఎడ్యుకేషన్, లెక్చరర్ ఇన్ టీచర్ ఎడ్యుకేషన్, లెక్చరర్ ఇన్ తెలుగు, లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, లెక్చరర్ ఇన్ ఫైన్ ఆర్ట్స్, లెక్చరర్ ఇన్ ఇంగ్లీష్, సీనియర్ లెక్చరర్ ఇన్ ఈవీఎస్, లెక్చరర్ ఇన్ ఈవీఎస్, లెక్చరర్ ఇన్ సోషల్ స్టడీస్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన ఎస్‌జీటీలు ఈనెల 29వతేదీ లోపు గూగుల్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు డీఈఈ.చిత్తూరుజిల్లాజూజ్.50డీసీ ద్వారా వెబ్‌సైట్‌నుగానీ, పల్లిపాడు లోని డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌నుగానీ సంప్రదించాలని కోరారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరి డీబార్

వెంకటాచలం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధి లోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో గురువారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 14,854 మంది విద్యార్థులకుగాను 13,877 మంది హాజరు కాగా, 977 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరులోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని డీబార్ చేసినట్లు తెలిపారు.

కనిపించని ఆనవాళ్లు !

- జిల్లాలో పోలియోను నిర్మూలించాం...
- మంచి ఫలితాలు ఇస్తున్న నిర్మూలన ఉద్యమం
- పోలియో రహిత జిల్లాగా గుర్తింపు
- ఏటా 3.38 లక్షలమంది పిల్లలకు చుక్కల మందు
- నేడు ప్రపంచ పోలియో నివారణ దినం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలియో అంటే ఒకప్పుడు అందరూ భయపడేవాళ్లం. 1916లో న్యూయార్క్‌లో 2వేల మంది, యూఎస్‌లో 1952లో 3వేల మంది మృత్యువాత పడ్డారు.అదే మనదేశంలో 1945 నుంచి 1984 వరకు 150 మంది మాత్రమే మృత్యువాత పడగా, ఎంతోమంది దివ్యాంగులు అయ్యారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ఈ వ్యాధిన బారినపడ్డారు. ఈ పరిస్థితిలో ప్రపంచ వ్యాప్తంగా పోలియో వ్యాధిపై చేసిన ప్రయోగాల ఫలితంగా నేడు వ్యాధిగ్రస్థులు తగ్గారు. కేవలం ఒక్క శాతం మాత్రమే పోలియో కేసులు నమోదు కావడం ఇందుకు నిదర్శనం. ఈ వ్యాధిపై పూర్తిగా అవగాహన కలిగించే దిశగా రోటరీ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా చేపట్టిన చర్యలు, టీకా కనుగొన్న జోనస్‌సాల్క్ పుట్టినరోజు సందర్భంగా అక్టోబర్ 24న (నేడు) ప్రపంచ పోలియో నివారణ దినం జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది.

● లక్షలాది చిన్నారులకు చుక్కల మందు

ప్రతి ఏటా జిల్లాలో 3.38 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నారు. ఇప్పటివరకు 53 సార్లు పల్స్ పోలియో కార్యక్రమాలు జిల్లాలో చేపట్టి ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేశారు. జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాల్లో సైతం 3వేలకుపైగా పోలియో బూత్‌లను ఏర్పాటు చేసి 12వేల మంది సిబ్బంది సహకారంతో పోలియో చుక్కలను వేశారు. ప్రత్యేకించి సమస్యాత్మకమైన ప్రాంతాలలోనూ, రైల్వే, ఆర్టీసీ ప్రాంతాలలోనూ మొబైల్ బూత్‌ల ద్వారా ఈ కార్యక్రమం ఏటా జోరుగా సాగుతుంది. ఇందులో వైద్య ఆరోగ్య శాఖతోపాటు అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాలుపంచుకుంటున్నారు.



చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

● ఏటా రూ. 40 లక్షలు వెచ్చించి

పల్స్ పోలియో నిర్వహణకు ఏటా ప్రభుత్వం రూ. 40లక్షలను జిల్లాకు కేటాయిస్తుంది. మొత్తం జిల్లాలోని 52 పీహెచ్‌సీలు, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సీహెచ్‌సీల పోలియో చుక్కలను పంపిణీ చేస్తున్నారు. కావలి, వింజమూరు, ఉదయగిరి, ఆత్మకూరు, పొదలకూరు, కొడవలూరులలో పోలియో స్టాక్ పాయింట్‌లు ఏర్పాటు చేసి పోలియో చుక్కలను పంపిణీ చేస్తున్నారు. 2013లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కలకత్తాలో ఓ పోలియో కేసు నమోదు కావడంతో దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం ఇంకా కొనసాగుతుంది.

● ఆధునిక పోలియో మందు

పోలియో వ్యాధి నివారణకు ట్రైవాలెంట్ వ్యాక్సిన్ గతంలో వాడేవారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బైవాలెంట్ వ్యాక్సిన్ అందుబాటులోకి రావడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. గతంలో పీ1, పీ2, పీ3, వైరస్‌కు సంబంధించి ట్రైవాలెంట్ వ్యాక్సిన్ వాడేవారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా గత ఏడాదిగా పీ2, వైరస్ నిర్మూలన కావడంతో కొత్త వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది.

జిల్లాను పోలియోరహితంగా మార్చాం



జిల్లాను పోలియో రహిత జిల్లాగా మార్చాం. ప్రస్తుతం జిల్లాలో ఎలాంటి పోలియో కేసులు లేవు. అయితే ప్రభుత్వం పోలియో నివారణ చర్యలు చేపడుతోంది. ప్రతీఏటా పోలియో చుక్కలు వేస్తున్నాం. దీన్ని ఉద్యమంలా చేపడుతున్నాం. ఏటా రెండు సార్లు పోలియో చుక్కల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం.

- డాక్టర్ ఉమామహేశ్వరి,
జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

వర్షాలకు ప్యాచ్ వర్క్ గోవిందా!

- అధ్వానంగా పెంచలకోన రోడ్డు
- బస్సు ఇరుక్కుని ప్రయాణికుల అవస్థలు



వర్షాలకు అధ్వానంగా తయారైన పెంచలకోన రోడ్డు (ఇన్‌సెట్‌లో),రోడ్డుపై ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

కలువాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదూరుపల్లి-పెంచలకోన రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనకు వెళ్లే భక్తులకు ప్రయాణం నరకంగా మారింది. ఆదూరుపల్లి నుంచి దాచూరు కమ్మపాళెం వరకు 8 కి.మీ మేర సుమారు 6నెలల కిందట చేసిన ప్యాచ్ వర్క్ నామరూపాలు లేకుండా పోయింది. గురువారం పెంచలకోన నుంచి నెల్లూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు దాచూరు సమీపంలో రోడ్డుపై బురదలో ఇరుక్కుపోయింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు అవస్థలు పడ్డారు. ఈ రోడ్డుపై ఇక ద్విచక్ర వాహనంపై ప్రయాణమంటే సాహసమే అవుతుంది. సుమారు రూ.18లక్షలు పోసి చేసిన ప్యాచ్ వర్క్ అప్పుడే దెబ్బతినడంపై స్థానికులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెబాట

- సమస్యల పరిష్కారంలో జాప్యం సరికాదు
- వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి



డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యుల సమస్యలు తక్షణం పరిష్కరించాలంటూ వైద్యులు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కొందరు వైద్యులు పిల్లలతో కలిసి ఈ ధర్నాలో పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యుల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం జాప్యం సరికాదని అన్నారు. వైద్యుల సమస్యలు పరిష్కరించాలని గతంలో సమ్మెకు వెళితే ప్రభుత్వం కొంత గడువు కోరిందని, రోజులు గడుస్తున్నా స్పందన లేకపోవడంతో మళ్లీ ఇప్పుడు సమ్మెబాట పట్టామని చెప్పారు. పీహెచ్‌సీల్లో 20 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి ఉద్యోగోన్నతి లేదని, తక్షణమే టైంబౌండ్ ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 90ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు 50 శాతం మూలవేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బ్రహ్మేశ్వర నాయుడు, నవీన్‌కుమార్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, శ్రావణి, జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు.. మెరుపులు.. తెగిన విద్యుత్ తీగలు

బిట్రగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో పలుచోట్ల గురువారం మధ్యాహ్నం భారీ ఉరుములు, మెరుపులకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో పలుచోట్ల 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ మండల ఏఈ జడరాయ, లైన్‌ఇన్‌స్పెక్టర్ మురళీధర్ శర్మ, సిబ్బంది విద్యుత్ లైన్ పెట్రోలింగ్ నిర్వహించారు. దగదర్తి మండలం అనంతారం, ఉలవపాళ్ల మధ్య పిడుగుపాటుకు 33 కేవీ విద్యుత్ లైన్ పిన్ ఇన్స్‌లేటర్ పగిలిపోయినట్లు గుర్తించి, మరమ్మతులు చేపట్టారు. తాళ్ళూరు 11 కేవీ ఫీడర్ విశ్వనాధరావుపేట కొత్తూరు పొలాల్లో తెగిపోయిన విద్యుత్ తీగలను సరిచేశారు. చైతన్య నగర్, కొండబిట్రగుంట ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపోవడంతో అధికారులు, సిబ్బంది వాటికి మరమ్మతులు చేస్తున్నారు.



మరమ్మతులు చేయిస్తున్న ఏఈ జడరాయ

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు

● గండిపాళెం జలాశయానికి చేరిన వరద నీరు



గండిపాళెం జలాశయాన్ని పరిశీలిస్తున్న డీఈ, ఏఈలు

ఉదయగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉదయగిరి, దుత్తలూరు మండలాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు జలకళ సంతరించుకున్నాయి. గురువారం సాయంత్రం భారీ వర్షం కురడంతో పట్టణంలో వీధులు వాగుల్లా, పంచాయతీ బస్టాండ్ చెరువును తలపించాయి. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గండిపాళెం జలాశయానికి వరద చేరుతోంది. 35 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన జలాశయం 2 అడుగల నీటిమట్టంతో డెడ్‌స్టోరేజీకి చేరింది. పైతట్టు ప్రాంతం వాగులు ప్రవహిస్తుండడంతో ప్రస్తుతం జలాశయం నీటిమట్టం ఎనిమిది అడుగులకు చేరిందని జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి తెలిపారు. ఏఈలు వేణు, సురేష్‌లతో కలిసి జలాశయాన్ని పరిశీలించడంతోపాటు పిల్లాపేరు, దున్నపోతుల వాగుల ప్రవాహాన్ని పరిశీలించారు. పైతట్టు ప్రాంతాల నుంచి జలాశయంలోకి 700 క్యూసెక్కుల ప్రవాహం వస్తుందని, ఇది మరింత పెరిగే అవకాశముందని వారు ఈ సందర్భంగా తెలిపారు.

వర్షాలకు ఉరుస్తున్న చెక్కనగిషీ కేంద్రం

● హస్త కళాకారుల అవస్థలు

ఉదయగిరి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో గల చెక్కనగిషీ కేంద్రం గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఉరుస్తుండడంతో హస్త కళాకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం పూర్తిగా శిధిలావస్థకు చేరడం, రేకులు దెబ్బతినడంతో వర్షాలకు ఉరుస్తూ యంత్రాలు, కళాకారులు తయారుచేసిన వస్తువులు తడిసి పాడవడంతోపాటు నాణ్యత కోల్పోతున్నాయని వాపోతున్నారు. కేంద్రం మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పలుమార్లు పాలకులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెక్కనగిషీ కేంద్రం మరమ్మతులకు నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



కేంద్రంలో తడిసిన చెక్కనగిషీ వస్తువులను శుభ్రం చేస్తున్న కళాకారులు

ప్రతి సమస్యకు కులాలను ముడిపెట్టడం సరికాదు..

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, అయితే ప్రతి సమస్యను కులాలకు ముడిపెట్టి కులరాజకీయాలు చేస్తుండటం దురదృష్టకరమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏ కులమూ గంపగుత్తగా ఒక పార్టీకి ఓట్లు వేయదని, అలాంటప్పుడు తనకు అత్యధిక మెజారిటీ అందించిన నియోజకవర్గ ప్రజలను కులాల ప్రాతిపదికన చూడాల్సిన అవసరం ఎందుకొస్తుందని ఆయన ప్రశ్నించారు. దారకానిపాడు ఘటనలో కులాల ప్రాతిపదికన నాపై బురదజల్లాలని విశ్వప్రయత్నం చేశారని, అయితే బాధిత కుటుంబాలకు అండగా చిత్తశుద్ధితో పనిచేయటం జరిగిందని వివరించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రాళ్లపాడు ప్రాజెక్టుకు సరిపడా నీరురాక ఇబ్బంది ఎదురైనప్పటికీ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశాబ్దాలుగా పెండింగ్ ఉన్న జీకేఎన్ కెనాల్ అభివృద్ధి పనులను కేవలం 16 నెలల్లో పూర్తి చేసి రాళ్లపాడుకు సోమశిల జలాలు అందించేందుకు ఏర్పాట్లు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు అతిత్వరలోనే కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపటం జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమెట్ల గురునాథం, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 58మందికి వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. 41.22 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు.

42వ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు బిట్రగుంట విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బిట్రగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంట వాకర్స్ క్రీడామైదానంలో ఇంటర్నేషనల్ మాస్టర్ ఈ రవిగన్ ఆధ్వర్యంలో తైక్వాండోలో శిక్షణ పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లాలో ఈ నెల 24, 25 తేదీలలో జరిగే 42వ ఏపీ స్టేట్ జూనియర్స్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలకు 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు మాస్టర్ రవిగన్ తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ బర్నాడ్, గౌరవాధ్యక్షుడు ఎం స్వర్ణన్‌రాజ్, మాజీ గౌరవాధ్యక్షుడు ఎన్ఎస్ యాదవ్, మైనార్టీ నాయకుడు జహీర్, విద్యార్థులను అభినందించారు.

స్పందించని వాటర్ ప్లాంట్ యజమానులు

కావలి,అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): వాటర్ ప్లాంట్ అనుమతుల పత్రాలు, నాణ్యతాప్రమాణాల నివేదికలు మున్సిపల్ కార్యాలయానికి తెలియచేయాలని నోటీసులు ఇచ్చినా స్పందించని వారిపై చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో వాటర్ ప్లాంట్‌లు సరిగా నిర్వహించటం లేదన్నారు.

త్వరలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడతాం!



అల్లూరు రోడ్డులో ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దగదర్తి (బిట్రగుంట) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం అల్లూరురోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపాన ప్రమాద స్థలాన్ని ఆర్టీవో, ఎన్‌హెచ్-5, పోలీసు అధికారులు గురువారం పరిశీలించారు. కావలి మార్గంలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలపై అధికారులు చర్చించారు. 2017- 18 మధ్య కాలంలో అల్లూరు రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. దీంతో బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టారు. పనులు ప్రారంభ దశలోనే గుత్తేదారుకు నిర్మాణం విషయంలో సమస్య తలెత్తడంతో పనులు ఆపేశారు. నెల్లూరు వైపు వెళ్లే మార్గాన్ని సింగిల్ వే చేసి వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. దీంతో తరచూ వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఇక్కడ ఇద్దరు మృతి చెందడంతో అధికారులు గురువారం ఆ మార్గాన్ని పరిశీలించారు. జిల్లా ఆర్టీవో బాల మురళీకృష్ణ, జిల్లా రవాణాశాఖ అధికారి చందర్, ఎన్‌హెచ్ 5 అధికారి, కావలి రూరల్ సీఐ పాపారావు ఆ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించారు. ఆ రహదారిలో ప్రమాదాలు జరగకుండా ఫోకస్ లైట్లు, రేడియం స్టిక్కర్లు, డివైడర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆగిన ఫ్లైఓవర్ పనులను త్వరలో ప్రారంభించేందుకు టెండర్లు పిలిచేలా అధికారులు చర్యలు చేపట్టారన్నారు. వారి వెంట పాటు దగదర్తి, బోగోలు ఎస్ఐలు జంపాని కుమార్, ఎన్ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

వర్షం లెక్క... పక్కానేనా...?

నమోదు కేంద్రాలు మరమ్మతులు గురికావడమే కారణం



ఉదయగిరిలో వర్షపాత నమోదు కేంద్రం

ఉదయగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ వర్షం కురిసినా ఎంత వర్షపాతం నమోదైందన్న వివరాలను అధికారులు వెల్లడిస్తుంటారు. వాస్తవానికి ఇవన్నీ కాకి లెక్కలే అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఆ వివరాలు నమోదు చేసే పరికరాలు చాలా చోట్ల మరమ్మతులకు గురికావడమే ఇందుకు కారణం. ఉన్న వాటిలో సగటును లెక్కగట్టి అధికారులు వర్షపాతం నమోదు చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

జిల్లాలో రెవెన్యూ పరిధిలో 38, ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ (ఏడబ్ల్యూఎస్)లు 192 మొత్తం 230 వర్షపాతం నమోదు కేంద్రాలు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఎక్కువగా వీటిని ఏర్పాటు చేశారు. సౌరశక్తి ఆధారం గా పనిచేసేవీ ఇందులో ఉన్నాయి. వీటి నిర్వహణకు ఏటా నిధులు మంజూరు చేయాలి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం చేయడం తో చాలావరకు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని తుప్పు పట్టగా, మరికొన్ని దెబ్బతిని ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో వర్షపాతం వివరాలు పక్కాగా తెలియడంలేదు. జిల్లాలో 230 వర్షపాత నమోదు కేంద్రాల్లో పలు కేంద్రాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో అవి పనిచేసే చోట పడిన వర్షం ఆధారంగా సగటు లెక్కలు కట్టి సరిపెడుతున్నారు. ఇటీవల ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారామపురం, వింజమూరు తదితర మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నా అధికారులకు నమోదు కేంద్రాలు తక్కువ వర్షపాతం నమోదైనట్లు చూపడమే ఇందుకు నిదర్శనం. ఈప్రభావం పంటల సాగుపై పడే ప్రమాదముంది. మరమ్మతులకు గురైన వర్షపాతం నమోదు కేంద్రాలను బాగు చేసేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. సామగ్రి వస్తే మరమ్మతులు చేయనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

'స్త్రీనిధి' పేదల పెన్నిధి !

- 48 గంటల్లోనే రుణం మంజూరు
- ఫోన్‌పే ద్వారా తిరిగి చెల్లించే అవకాశం
- పొదుపు మహిళల హర్షం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాల్లోని పేదమహిళలకు 48 గంటల్లోగా రుణాలు అందచేసి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన పథకం 'స్త్రీనిధి' ఈ పథకం ద్వారా ఎంతోమంది మహిళలు రుణాలు తీసుకుని, జీవనోపాధి పొందారు. గతంలో రుణం తీసుకోవాలన్నా, తిరిగి కట్టాలన్నా ఎంతో కష్టంగా ఉండేది. స్త్రీనిధి రుణాలను కొన్ని గంటల వ్యవధిలోనే అందచేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో పొదుపు గ్రూపుల మహిళలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఎప్పటి కప్పుడు పొదుపు సంఘాల మహిళలకు ఆర్థిక తోడ్పాటునందిస్తోంది. దీంతో వారు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నారు.

● సభ్యురాలికి ప్రత్యేకంగా రుణం

గ్రూపు రుణంతోపాటు సభ్యురాలికి విడిగా రుణం ఇచ్చే వెసులుబాటు స్త్రీనిధి పథకంలో ఉంది. కేవలం 92 పైసల వడ్డీకే ఈ రుణం అందచేస్తున్నారు. జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు, ఇతర ఫీజులు ఏమీ లేవు. రుణం కోరిన 48గంటల్లోనే అందచేస్తారు. ఒక్కొక్క సభ్యురాలికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందచేస్తారు. గ్రూపు అంటే పదిమంది ఉన్న పొదుపు గ్రూపునకు రూ. 5లక్షల వరకు రుణం ఇస్తున్నారు. సభ్యులకు విడిగా, లేదా గ్రూపుగా రుణాలు ఇవ్వటం వల్ల పొదుపు సంఘాల మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నారు.



● రూ. 298 కోట్ల లక్ష్యం

జిల్లాలో స్త్రీనిధి పథకం కింద 2025-26 సంవత్సరంలో రూ. 298కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఇప్పటివరకు 16,273 గ్రూపులకు రూ. 122 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. 2024-25లో జిల్లాకు రూ.178 కోట్ల రుణ పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించగా, జిల్లా రూ.179కోట్ల లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఈ లక్ష్యసాధన శాతం 103 శాతం కావటం విశేషం. సులభ వాయిదాల్లో 2 నుంచి 3 ఏళ్ల వ్యవధిలో రుణం చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఒకవేళ రుణం తీసుకున్న సభ్యురాలు మరణిస్తే సురక్ష పథకం ద్వారా చనిపోయిన రోజు నుంచి తీసుకున్న రుణం కట్టనవసరం లేదు.

● స్త్రీనిధి రికవరీ యాప్

రుణం తీసుకున్న సభ్యురాలు కాని, పొదుపు గ్రూపుకాని రుణాన్ని సులభంగా చెల్లించేందుకు స్త్రీనిధి యాప్‌ను ప్రవేశపెట్టారు. ఈ యాప్ ద్వారా తీసుకున్న రుణాన్ని సకాలంలో ఎలాంటి ఇబ్బందులకు లేకుండా చెల్లించవచ్చు. ఫోన్‌పే కలిగిన సభ్యురాలు నేరుగా రుణాన్ని ఆ యాప్ ఆధారంగా చెల్లించవచ్చు. గతంలో వీవోఏలు, గ్రూపులీడర్లకు, రుణాన్ని మొత్తం చెల్లిస్తే వారు తమ ఖాతాల్లో జమ చేయలేదనే ఆరోపణలు ఉండేవి. యాప్‌ను ప్రవేశపెట్టి, ఫోన్‌పే వినియోగాన్ని తీసుకురావటంతో రుణాన్ని సకాలంలో, బ్యాంకుకు వెళ్లకుండా, వీవోఏలు, గ్రూపులీడర్లను నమ్ముకోకుండా చెల్లించే అవకాశం ఏర్పడింది.

విరివిగా రుణాలు అందచేస్తున్నాం...



స్త్రీనిధి కింద పొదుపు మహిళలకు విరివిగా రుణాలు అందచేస్తున్నాం. గత ఏడాది లక్ష్యాన్ని మించి రుణాలు ఇచ్చాం. ఈ ఏడాది కూడా లక్ష్యాన్ని అధిగమించి రుణాలు అందచేస్తాం.

- నాగరాజకుమారి,
డీఆర్‌డీఏ, పీడీ

గుడ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు అవగాహన

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు సీఐ వేమారెడ్డి ప్రిన్సిపాల్ సుమతి ఆధ్వర్యంలో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రత, వ్యక్తిగత రక్షణ, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 11901
వెండి కిలో ధర	రూ. 156400
వెండి ఒక గ్రాము	రూ. 162.40

న్యూస్ బాక్స్

ఆలయాల్లో కార్తీకమాస పూజలు



భైరవకోనలో పూజలు చేస్తున్న భక్తులు

సీతారామపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘటిక సిద్దేశ్వం, భైరవకోన, సీతారామపురంలోని రామ లింగేశ్వరస్వామి ఆలయాల్లో పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం సందర్భంగా గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరాలయాలకు భక్తులు వేకువజామునే చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి కార్తీక దీపాలు వెలిగించారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి.

5న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఉదయగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వచ్చేనెల 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయగిరి డిపో నుంచి అరుణాచలంకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ రమేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సర్వీసు 4న ఉదయం 8 గంటలకు ఉదయగిరిలో బయలుదేరి దుత్తలూరు, వింజమూరు ఆత్మకూరు మీదుగా సిరిపురం గోల్డెన్ టెంపుల్‌ను దర్శించుకుని అరుణాచలం వెళుతుందన్నారు. రాను పోనూ ఒక్కొక్కరికి రూ.1,650 చార్జీ నిర్ణయించడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆధార్ కేంద్రాల ఏర్పాటు

ఉదయగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బీ శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈకేంద్రం శుక్రవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని, నూతనంగా ఆధార్‌కార్డు పొందేందుకు మరియు చేర్పులు, మార్పులు చేసుకునేందుకు అవకాశముందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

●**దుత్తలూరు:** మండలంలోని నందిపాడు, దుత్తలూరు జడ్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో చెంచమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేంద్రం శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

చికెన్ షాపుల ఏర్పాటుకు స్థలం పరిశీలన

వింజమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక బంగ్లా సెంటర్‌లో ఉన్న చికెన్ షాపులను ఇటీవల హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా తొలగించడం జరిగింది. మరో ప్రాంతంలో షాపులు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో వారి కోసం స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మలపరాజు వాగు సమీపంలో వింజమూరు మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి మండల అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. జంగిల్ క్లియరెన్స్ అనంతరం బాధితులకు స్థలాన్ని అప్పగించి తాత్కాలికంగా షాపులు ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేస్తున్నట్లు గూడా నర్సారెడ్డి, తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు ఖాదర్ బాషా, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగం గ్రామానికి చెందిన తోట శ్రీనివాసులు తన తండ్రి తోట చిన్నపెంచలయ్య వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం వెంగమాంబ దేవస్థానం చైర్మన్ బాలకృష్ణారెడ్డి చేతుల మీదుగా గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం



తహసీల్దారును సన్మానిస్తున్న సర్పంచి బాలకృష్ణారెడ్డి

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన సంగం తహసీల్దారు సోమ్లానాయక్‌ను పడమటిపాళెం సర్పంచ్ బాలకృష్ణారెడ్డి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్చం అందచేశారు. ఆయన సేవలను కొనియాడారు.

వర్షాలతో పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

● స్తంభించిన రాకపోకలు ● ప్రజలు, వాహనదారుల అవస్థలు ● ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు



సంగం : ప్రమాదకరంగా ఉన్న బీరాపేరు వాగు దాటుతున్న గ్రామస్థులు



వరికుంటపాడు: పిల్లాపేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలో బీరాపేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి బీరాపేరు వాగులో సుమారు 30వేల క్యూసెక్కులకు పైగా ప్రవహిస్తున్నాయి. దీంతో పెరమన వద్ద బీరాపేరు వంతెనపై అడుగులోతు నీటి ప్రవాహం ప్రవహిస్తోంది. పెరమన గ్రామస్థులు మండల కేంద్రానికి రావాలంటే బీరాపేరు వాగు దాటాల్సిందే. వంతెన ఉన్నా దానిపై నీరు ప్రవహిస్తుండడంతో తప్పని పరిస్థితుల్లో గ్రామస్థులు వాగు నీటిలోనే ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి పరిస్థితిని పరిశీలించి గ్రామస్థులెవరూ వాగు దాటవద్దని సూచించారు. దీంతో పెరమనకు రాకపోకలు నిలిచిపోయాయి.

●**వరికుంటపాడు(ఉదయగిరి రూరల్):** ఎడతెరిపి లేని వర్షాల తాకిడికి వాగులు, వంకలు వరద నీటితో జలకళను సంతరించుకున్నాయి. కనియంపాడు-రామదేవులపాడు గ్రామాల సమీపంలోని పిల్లాపేరు వాగులోకి ఆశించిన మేర నీరు చేరడంతో వంతెనపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో తహసీల్దారు హేమంత్ కుమార్, ఎస్ఐ రఘునాథ్‌లు గురువారం హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తాత్కాలికంగా రాకపోకలను నిలిపివేశారు. తిరిగి అధికారికంగా ప్రకటించే వరకు ప్రజలు, వాహనదారులు వంతెనపై ప్రయాణాలు సాగించకూడదని ఆదేశించారు. దీంతో వరికుంటపాడు, వింజమూరు మండలాలకు చెందిన పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తూర్పు బోయమడగల, కాంచెరువు గ్రామాల పరిధిలోని వాగుల్లోకి నీరు చేరి ఆ వంతెనలపై కూడా ప్రవహించే అవకాశముంది.

●**సీతారామపురం:** మండలవ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శివకృష్ణారెడ్డి తెలిపారు. దేవమ్మ చెరువులో లోతట్టు ప్రాంతాలను, వాగులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటిక సిద్దేశ్వరం దేవాలయానికి వెళ్లే దారిలోని వాగులు పొంగి ప్రవహిస్తునందున రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు.

కాలువ తవ్వకం



ఎస్సీ కాలనీ నుంచి తవ్విన ప్రత్యేక కాలువ

అనంతసాగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి ఎస్సీ కాలనీలో వర్షపునీరు చేరి ప్రజలు అవస్థలు పడుతుండగా సమస్యను గుర్తించిన తెలుగు రైతు మండల అధ్యక్షుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి తన సొంత నిధులు వెచ్చించి ఎక్స్‌కవేటర్‌తో ప్రత్యేక కాలువ తవ్వించారు. దీంతో వర్షపు నీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఎడతెరిపి లేని వర్షంతో ప్రజల అవస్థలు

ఆత్మకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాగా, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే ఆదుకునేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్డీవో బి పావని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ

ఉదయగిరి, అక్టోబరు 23(ఆంధజ్యోతి): అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వాగులు, వంకలను పరిశీలించి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. అవసరమైతే తప్ప నివాసాల్లో నుంచి బయటకు రావద్దన్నారు. ఏదైనా సమస్య తలెత్తితే 9440700001, 9440700003 అనే నెంబర్లకు వెంటనే సమాచారాన్ని తెలియజేయాలని ఆయన సూచించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి : సీపీఎం



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతసాగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షానికి మండలంలో దెబ్బతిన్న వరి, వేరుశెనగ పంటలకు నష్టపరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని సీపీఎం కౌలురైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం రైతులతో కలసి ఆందోళన చేశారు. ఎకరాకు రూ. 40 వేలు చెల్లించాలని కోరుతూ తహసీల్దారు జయవర్ధన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మూలి వెంగయ్య, లక్ష్మీపతి, అన్వర్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

బాలికను పరామర్శించిన ఎంపీడీవో



తల్లిదండ్రులను కోల్పోయిన బాలికను పరామర్శిస్తున్న ఎంపీడీవో

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నిమ్మతోపు సెంటర్‌లో తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన బాలిక భార్గవిని ఎంపీడీవో షాలెట్, డిప్యూటీ ఎంపీడీవో నరసయ్య గురువారం పరామర్శించారు. బాలికకు మనోధైర్యం కల్పించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సాగరం పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఖాదర్

అనంతసాగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీని జిల్లా అదనపు ఆరోగ్య వైద్యాధికారి ఖాదర్ గురువారం తనిఖీ చేశారు. ల్యాబ్ ను పరిశీలించారు. క్షయ నివారణ చర్యలు చేపట్టాలని, రెండు వారాలకు మించి దగ్గు ఇతర లక్షణాలు ఉన్న రోగులకు గల్ల పరీక్షలు చేయాలని ఆదేశించారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మిరాన్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి పెట్టుబడుల వరద : పొన్నెబోయిన



విలేఖరులతో మాట్లాడుతున్న చెంచలబాబు

ఉదయగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌బాబుల కృషితో రాష్ట్రానికి రూ.లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. గురువారం తన నివాసంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో పారిశ్రామికవేత్తలు భయపడి పరుగులు తీశారని, కూటమి ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు పోటీలు పడుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు రావడంతో లక్షల మంది యువత ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. విశాఖపట్నానికి గూగుల్ రావడంతో దేశం రాష్ట్రం వైపు చూస్తోందన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరిక మేరకు రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, అంబటి మస్తాన్, రాజా, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏవైజీ పథకం సర్వే పక్కాగా నిర్వహించాలి:ఎంపీడీవో



ఉదయగిరి: సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఉదయగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు కేంద్రప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన గ్రామీణ సర్వే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో బీ శ్రీనివాసులు, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ షరీఫ్‌లు సూచించారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో సచివాలయ, హౌసింగ్ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 905 మంది పక్కాగృహాల లబ్ధిదారుల వివరాలను వచ్చేనెల 5వ తేదీలోపు ఆవాజ్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. లబ్ధిదారుల వివరాలను జియో ట్యాగింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. 2029 నాటికి ప్రతి పేదవాడికి సొంతిల్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో బిజాక్ ప్రవీణ్, హౌసింగ్ ఏఈ శరత్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంపై సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పథకానికి అర్హులైన వారి నుంచి నవంబరు 5వ తేదీ లోపు దరఖాస్తులు స్వీకరించాలని, ఇళ్లలేని అర్హులు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం చేయాలని సూచించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో



కలువాయి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, వైద్య ఆరోగ్య సిబ్బంది

కలువాయి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య సిబ్బందికి డీఎంహెచ్‌వో సుజాత సూచించారు. గురువారం ఆమె కలువాయి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఫీవర్ సర్వే నిర్వహించి అవసరమైన అత్యవసర మందులు అన్నీ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్యం పరిశీలించి బ్లీచింగ్ చల్లాలని ఆమె సూచించారు.

జాబ్‌మేళాలో 45 మంది ఉద్యోగాలకు ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న యువతతో కంపెనీ ప్రతినిధులు

ఉదయగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో గురువారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ కార్యాలయం, సీడాప్‌లు సంయుక్తంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 105 నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొనగా వారిలో 45మంది ఉద్యోగాలకు ఎంపిక కావడంతో వారికి నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు అబ్దుల్‌ఖయ్యూం, ఎం.శ్రీధర్‌రావు, కళాశాల ప్రొఫెసర్ గోపికృష్ణ, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహా, శివకృష్ణ, సర్ఫుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ హరిచందన ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై బులుగు రంగు గళ్ల ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, మెరూన్ రంగు డిజైన్ లుంగీ ఉన్నాయి. 55-60 మధ్య వయసు ఉంటుంది. ఇతర ఆధారాలేవీ లభించకపోవడంతో ఎస్ఐ కేసు నమోదు చేసి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ మహిళ...

నెల్లూరు రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దంపతుల ఆత్మహత్యాయత్నంలో భర్త మరణించగా చికిత్స పొందుతున్న భార్య కూడా మరణించినట్లు రూరల్ సీఐ గుంజి వేణు గురువారం తెలిపారు. గుడిపల్లిపాడులో నివసించే దేవిరెడ్డి మురళీ రెడ్డి, ఆయన భార్య జలజ (46) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం విదితమే. ఆ రోజే మురళీరెడ్డి మృతిచెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జలజ కూడా మరణించినట్లు తమకు సమాచారం అందగా గురువారం పంచనామా నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ఇప్పటికే ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు...

మనుబోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈగ సాయికుమార్ (22) అనే యువకుడు మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పిడూరు మిక్స్‌డ్ కాలనీలోని ఈగ సాయికుమార్ అనే గిరిజన యువకుడు సెంట్రింగ్, వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడు. స్వస్థలంలో ఇల్లు కట్టుకునేందుకు పలుచోట్ల అప్పులు చేశాడు. వాటిని తీర్చేందుకు ఓ ఫైనాన్స్‌లో ఇంటిని తాకట్టుపెట్టి తల్లిపేరిట రుణం తీసుకున్నాడు. నెలవారీ కంతులు చెల్లించకపోతే ఫైనాన్స్ నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేస్తారన్న మనస్తాపంతో 14వ తేదీన సాయికుమార్ గడ్డిమందు తాగాడు. అప్పటినుండి నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ...

కావలి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి (60) మృతి చెందిన సంఘటన గురువారం కావలి పట్టణ ఉత్తర శివారులో జరిగింది. లోకో పైలెట్ ఫిర్యాదుతో జీఆర్పీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. గోదుమ రంగు చొక్కా, నలుపు రంగు లుంగీ, టవల్ ధరించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు 9440627648 నెంబరుకు సమాచారమివ్వాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కే వెంకట్రావ్ తెలిపారు.

విద్యుదాఘాతానికి గేదెల మృతి

● విద్యుత్ సిబ్బందిపై ఫిర్యాదు

చేజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదెలు మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పూర్తి వివరాల మేరకు.. చేజర్లకు చెందిన ఎం శారద అనే మహిళ గురువారం గ్రామ సమీపంలో ఉన్న కౌలుకు తీసుకున్న తోటకు మేత కోసం గేదెలను తోలుకుని వెళుతుండగా ఎస్‌టి కాలనీలో ఉన్న తాగునీటి బోరుకు పోయే విద్యుత్ లైన్‌కు సంబంధించిన తీగ తెగి పొలంలో పడి ఉంది. దీంతో అటుగా వెళ్ళిన 10 గేదెలలో 5 గేదెలు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. దాదాపు నాలుగు లక్షల రూపాయల విలువచేసే గేదెలు విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాయని శారద ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం విద్యుత్‌శాఖ సిబ్బందిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

బ్యాంకు కాలనీలో బంగారం, వెండి చోరీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బీవీనగర్ బ్యాంక్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. బ్యాంకు కాలనీలో జీ ప్రియాంక, హరీష్ దంపతులు నివసిస్తున్నారు. ప్రియాంక పొదలకూరురోడ్డులోని జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలు. ఆమె భర్త ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఈనెల 18వ తేదీ రాత్రి దంపతులు ఇంటి తలుపునకు గడియపెట్టడం మరిచిపోయి నిద్రపోయారు. 19వ తేదీ తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో హరీష్ మంచినీళ్ల తాగేందుకు లేచి చూడగా బెడ్‌రూమ్‌లోని బీరువా తెరిచి ఉంది. అందులో ఉన్న 51 గ్రాములకు పైగా బంగారు ఆభరణాలు, 250 గ్రాముల వెండి వస్తువులు కనిపించలేదు. బాధితురాలు గురువారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుడిని బెదిరించి నగదు దోపిడీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు అని కూడా చూడకుండా కత్తితో చంపుతానని ఓ రౌడీషీటర్ బెదిరించి నగదు దోచెకెళ్లిన ఘటన నెల్లూరులోని మెక్లిన్స్ రోడ్డులో చోటు చేసుకుకుంది. కోటమిట్ట మెక్లిన్స్ రోడ్డులో నివసించే దివ్యాంగుడు హయత్‌బాషా గురువారం సైకిల్‌పై తన అన్న గౌష్‌బాషా ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రౌడీషీటర్ సుల్తాన్ అడ్డగించాడు. రూ.వెయ్యి నగదు ఇవ్వాలని లేకుంటే చంపుతానని కత్తితో బెదిరించాడు. భయపడిపోయిన హయత్‌బాషా తన జేబులోని రూ.500 నగదు సుల్తాన్‌కు ఇచ్చాడు. దీంతో సుల్తాన్ అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీ కొన్న ట్రావెల్ బస్సు

మనుబోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జాతీయరహదారిపై కొండూరు సత్రం క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. చెన్నై నుంచి ఆత్మకూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు ఆత్మకూరుకు వెళుతుండగా సత్రం క్రాస్‌రోడ్డు సమీపంలో ఒక్కసారిగా రోడ్డుపైకి ఆవులు గుంపుగా రావడంతో డ్రైవర్ సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వేగంగా వస్తున్న బెంగళూరు-నెల్లూరు ట్రావెల్ బస్సు ఆత్మకూరు బస్సు వెనుకభాగాన ఢీకొంది. దీంతో ట్రావెల్‌బస్సు ముందుభాగం సుమారుగా దెబ్బతినింది. అయితే ట్రావెల్‌బస్సులో ప్రయాణీకులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆత్మకూరు బస్సులోని ప్రయాణీకులను మరో బస్సులో ఎక్కించి పంపారు. కొమ్మలపూడి నుంచి మనుబోలు వరకు ఎక్కువగా గేదెలు, ఆవులు రోడ్డుపైకి రావడంతో గతంలో పలు ప్రమాదాలు జరిగాయి. దీనిపై పోలీసులు, ఐజేఎం అధికారులు స్పందించి రోడ్డుపైకి ఆవులు, గేదెలు రాకుండా చర్యలు తీసుకోవాలని హైవే ప్రయాణీకులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 560

కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కావలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కావలి డిపోనుంచి పలు పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం ఆదినారాయణ తెలిపారు. అరుణాచలంకు ఈ నెల 26న, నవంబరు 4, 9, 16 తేదీలలో, శ్రీశైలంకు ఈ నెల 26, నవంబరు 2, 9, 16 తేదీలలో, పంచారామాలకు నవంబరు 2, 9 తేదీలలో బస్సులు నడుపుతున్నామన్నారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ లో రిజర్వేషన్ చేయించుకోవాలని, ఆన్‌లైన్ రిజర్వేషన్‌కూడా ఉందన్నారు. వివ రాలకు 7382926413, 9493913989, 9966009395 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోండి

కావలి (టౌన్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉచిత సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు బ్రహ్మానందం కోరారు. గురువారం పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ డీఇ సాయిరామ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక రూపాయికే బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డు, ఈ సిమ్ కార్డు అందుబాటులో ఉన్నాయన్నారు. బీఎస్ఎన్ఎల్ ఇంటర్‌నెట్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నారని, నెట్‌వర్క్ మెరుగు కోసం అదనంగా టవర్ల ఏర్పాటుకు ప్రయత్నం జరుగుతోందన్నారు. మరో ఏడాదిలో 5జి నెట్‌వర్క్ పూర్తిగా అందుబాటులోకి వస్తుందన్నారు. డీఇ సాయిరామ్ మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ దీపావళి ధమాక ఆఫర్లను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జే డీవో బాషా, ప్రసాద్, ఎస్టీఈ ప్రభాకర్, బీజేపీ ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను తలపిస్తున్న రహదారులు

కావలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గురువారం కురిసిన వర్షాలకు పట్టణంలోని అనేక ప్రాంతాలలో వాగులు, చెరువులను తలపించేలా రోడ్లపై వాన నీరు ప్రవహిస్తోంది. ప్రధానంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు పూర్తిగా పూడి పోవటంతో నీరు పోయేందుకు మార్గం లేక రోడ్లపైకి చేరుతోంది. అనేక చోట్ల ఉన్న కాలువలపై బండలు వేసి ఉండటం, పూడిక తీయకపోవటంతో మార్గాలన్నీ మూసుకు పోయాయి. దీంతో రోడ్లన్నీ మడుగులను తలపిస్తున్నాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా సబ్‌కోర్టు వీధిలో మోకాళ్ల లోతు నీరు నిల్వ ఉంటోంది. అలాగే కావలి పాతూరులోని శివాలయం వీధి, వెంగళరావునగర్‌లోని తుఫాన్‌నగర్, ఇంది రానగర్ తదితర ప్రాంతాలు వాగులను తలపిస్తున్నాయి. ఉదయగిరి రోడ్డులోని విట్స్ కళాశాల సమీపంలో భారీగా వర్షపు నీరు నిలిచి ఉండటంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కావలి-పెదపవని రోడ్డు నుంచి ఉదయగిరి రోడ్డులోకి వచ్చే బైపాస్ రోడ్డు మలుపు వద్ద వర్షపు నీరు నిలిచింది. బస్టాండు వద్ద పెద్దపవని రోడ్డు వర్షపునీటితో చెరువులా మారింది. ఇలా పట్టణంలో అనేక ప్రాంతాలలో డ్రైనేజీ కాలువలపై మూత వేయటం, పూడిక తీయ కపోవటం, కాలువలు నిర్మించకపోవటంతో వర్షపు నీరు, డ్రైనీజీ నీటిలో కలిసి రోడ్లపై ప్రవహిస్తోంది.

బిట్రగుంట: బోగోలు మండల పరిధిలోని సముద్రంలో గురువారం ఉధృతంగా అలలు ఎగసిపడ్డాయి. భారీ ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఓ మోస్తరుగా కురిసింది.



చెరువును తలపిస్తున్న కావలిలోని మినీ స్టేడియం గ్రౌండ్

ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండుతున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి సూచించారు.

అల్లూరు : కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజుపాలెం-ఇస్కపల్లి ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల రోడ్లపై గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండడంతో ఎక్స్‌కవేటర్ల సాయంతో రోడ్లు చదును చేసి రాకపోకలకు ఆటంకం లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అయితే వర్షాలకు మళ్లీ రోడ్లపై నీరు నిల్వ ఉండడంతో మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నార్తుఆములూరు నుండి ఇస్కపల్లి వరకు ఇదే పరిస్థితి ఉండడంతో మండల ప్రజలు ప్రయాణం అంటేనే విసిగిపోతున్నారు.

కాంక్రీట్ గోడతో మునక నుంచి రక్షణ

కావలి (టౌన్): వర్షాలు పడినప్పుడల్లా పట్టణంలోని ముసునూరు గిరిజన కాలనీ మునకకు గురయ్యేది. అధికారులు, నాయకులు, మీడియా అందరూ రావడం ఇక్కడ సర్వసాధారణం. కానీ.. ఈసారి ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నం. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా గిరిజన కాలనీ మునకకు గురిచేసే రైలు కట్టపైనుంచి వచ్చే వరద నీటిని దారి మరల్చేందుకు కట్టుదిట్టంగా కాంక్రీట్ వాల్ నిర్మాణం చేయించారు. వారం నుంచి ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నప్పటికీ కాలనీలో చుక్కనీరు నిలవకపోవడంతో గిరిజన కాలనీకి మునకనుంచి మోక్షం లభించింది. గత 20 ఏళ్లలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని గిరిజనులు తెలిపారు. వరదలప్పుడు పులిహోర పొట్లాలు అందించి, ఫోటోలు దిగి వెళ్లిపోయారే కానీ సమస్యకు పరిష్కారం చూపలేదన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గిరిజనులు 'థ్యాంక్యూ ఎమ్మెల్యే సార్' అంటున్నారు.



ముసునూరు గిరిజన కాలనీలో నిర్మించిన కాంక్రీట్ గోడ

చెరువును తలపిస్తున్న ట్రంకురోడ్డు

కావలి (టౌన్) అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రంకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు పూడికతో నిండిపోవడంతో మురుగునీటితో కలిసి వాననీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా ఏఎం బేకరి కూడలి, ఆర్అండ్‌బీ అతిథి గృహం కూడలి, టీటీడీ కల్యాణమండపం కూడళ్లలో రోడ్లపై మరుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహన చోదకులు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఏఎం బేకరి, ముసునూరు ఆటోనగర్ ప్రాంతంలో వర్షపునీటితో ట్రంకురోడ్డు చెరువును తలపిస్తోంది. ఏడాదికొకసారి మున్సిపాలిటీ సిబ్బంది డ్రైనేజీలు శుద్ధి చేసి, ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికి వదిలేయడంతో తిరిగి వ్యర్థాలతో నిండిపోతున్నాయి.

మురుగు నీరు వెళ్లే దారేదీ?

కావలి రూరల్: వర్షాలతో స్థానిక బాలక్రిష్ణారెడ్డి నగర్ వాసులకు తిప్పలు తప్పటం లేదు. పేదలు అధికశాతం నివశిస్తున్న ఈ ప్రాంతంలో గురువారం కురిసిన వర్షానికి రోడ్లపైకి నీరు చేరింది. మురుగు కాలువలు లేకపోవటం తో నీరు ఇళ్లలోకి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇందిరానగర్ నుండి బాలక్రిష్ణారెడ్డి నగర్‌కు వచ్చే మార్గంలో చర్చి సమీపంలో చిన్న కల్వర్టు ఉంది. అక్కడ వర్షపు నీరు మొత్తం 4 అడుగుల మేర రోడ్డు పైకి చేరింది. అలాగే బుడంగుంట గేటు మార్గంలో కూడా వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనలు సైతం బురదలో కూరుకుపోతుండటంతో ఇళ్ల నుండి బయటకు రాలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు దగ్గర్లో రైల్వే ట్రాక్, కంప చెట్లు ఉండటంతో రాత్రి వేళల్లో ఇళ్లలోకి పాములు వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎక్సైజ్ సురక్షా యాప్‌తో నకిలీ మద్యానికి అడ్డుకట్ట

- ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యం నిర్మూలనకు ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షిత మద్యం అందించాలనే లక్ష్యంతో కూటమిప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్‌పై అవగాహనా కార్యక్రమాన్ని పామూరు బస్టాండ్ సెంటర్‌లోని గాయత్రీ వైన్‌షాప్ వద్ద గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే క్యూఆర్ కోడ్ ఆధారిత యాప్‌ను ప్రారంభించి వినియోగ దారులు నకిలీమద్యాన్ని గుర్తించేందుకు ఈ యాప్‌ను ఉపయోగించుకునే విధానాన్ని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి మద్యం షాపు, బార్‌లలో మద్యం సీసాను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసిన తర్వాత మాత్రమే విక్రయించాలనే నిబంధనలు అమల్లోకి వచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వంలో కల్తీమద్యం ఏరులై పారి ప్రజల ఆరోగ్యాలు క్షీణించాయని నేడు ప్రభుత్వం ఆ పరిస్థితులు లేకుండా చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ కె. శ్రీనివాసరావు, ఎస్ఐలు కే. తేజశ్వర్, ఎస్. రేవతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సురక్షా యాప్ పనితీరుపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎక్సైజ్ అధికారులు, ఎమ్మెల్యే ఇంటూరి

సీపీఐ నూతన కార్యదర్శికి అభినందన

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన గుజ్జుల ఈశ్వరయ్యను కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. విజయవాడలో జరిగిన ఆయన బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి హాజరైన సురేష్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.



గుజ్జుల ఈశ్వరయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న సురేష్‌బాబు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు టెక్నికల్ చైర్మన్‌గా అఖిల్ ఎంపిక


కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని ఛాంపియన్స్ తైక్వాండో అకాడమీలో ఈనెల 25, 26 తేదీలలో జరగబోవు 42వ జూనియర్ బాలబాలికల రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు టెక్నికల్ చైర్మన్‌గా కందుకూరుకు చెందిన పి అఖిల్ ఎంపికయ్యారని తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్ ఎస్కే అబ్దుల్‌సలాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా అఖిల్‌ను పలువురు అభినందించారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

కావలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల సౌకర్యార్థం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కావలి ఆర్టీసీ డీఎం ఆదినారాయణ తెలిపారు. డీఎం కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రయాణీకులు తమ సమస్యలు, సూచనలను 9959225643 నంబరుకు ఫోన్ చేసి చెప్పాలని, సమస్యలను తప్పక పరిష్కరిస్తామన్నారు. కావలి డిపో పరిధిలోని కావలి, జలదంకి, కలిగిరి, కొండాపురం, బోగోలు, దగదర్తి ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పనికి దూరమైన చేనేతలను ఆదుకోవాలి

నెల్లూరు రూరల్, అక్టోబరు 23,(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల కారణంగా పనికి దూరమైన చేనేత కార్మిక కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పముజుల హరి కోరారు. నెల్లూరు రూరల్లోని సౌత్‌మోపూరు, ములుముడి గ్రామాలలోని చేనేత కార్మికులను ఆయన గురువారం పరామర్శించారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామాలలో వాస్తవ పరిస్థితులను ప్రభుత్వానికి తెలియపరిచి చేనేతలకు చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిత భారత వీవర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటసుబ్బయ్య, జక్కల వెంకటేశ్వర్లు, మణి పాల్గొన్నారు.



గ్రేటర్ ప్రతిపాదన వాయిదా!

తిరుపతి మహానగరిగా మారేందుకు తొలి అడుగు పడేక్రమంలోనే అడ్డుతగిలింది. ఓ ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పడంతో తాత్కాలికంగా వాయిదా పడనుంది. కొన్ని పంచాయతీల విలీనంపై ప్రభుత్వ పెద్దలతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరినట్టు తెలిసింది. దీంతో శుక్రవారం జరగనున్న కౌన్సిల్ అజెండాలో చేర్చిన అంశంపై చర్చలేకుండా వాయిదా వేయనున్నారు. అయితే కొందరు వైసీపీ కార్పొరేటర్లు మాత్రం గ్రేటర్ తీర్మానాన్ని సమర్థిస్తున్నట్టు సమాచారం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- కౌన్సిల్లో తీర్మానానికి ముందే ఓ ఎమ్మెల్యే అభ్యంతరం
- కొన్ని పంచాయతీలపై చర్చించాకే నిర్ణయం
- నేడు తిరుపతి కార్పొరేషన్ సమావేశం

వైజాగ్, విజయవాడ తరహాలో తిరుపతిని అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఆ దిశగా తిరుపతిని గ్రేటర్ చేయాలని అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేశారు. తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాలకు చెందిన 63 పంచాయతీలతో సిద్ధమైన ప్రతిపాదిత జాబితా మున్సిపల్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేసేందుకు అజెండాలో పొందుపరిచారు. నాలుగురోజుల క్రితం జరిగిన ప్రీకౌన్సిల్ మీట్‌లోనూ గ్రేటర్‌పై చర్చించారు. గ్రేటర్‌కు మేయర్ శిరీష కూడా సుముఖంగా ఉన్నట్టు తెలిసింది. కౌన్సిల్ తీర్మానాన్ని మహానగరిగా ఆమోదం కోరుతూ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో గ్రేటర్‌లో విలీనమవుతున్న పంచాయతీలకు ప్రాతినిథ్యం వహిస్తున్న ఓ ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పడంతో వాయిదా పడనుంది. తిరుపతి కార్పొరేషన్ పరిధి చాలా తక్కువ. దీని పరిధి పెంచకపోతే అభివృద్ధి సాధ్యం కాదనేది ప్రభుత్వ వాదన. కాగా, తర్వాత జరగబోయే కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ అంశం ఉంటుందని కార్పొరేషన్ అధికారులు చెబుతున్నారు.

గ్రేటర్ ప్రయోజనాలివీ..

పంచాయతీల నుంచి నగరపాలికలో చేరితే సత్వరం పురసేవలు అందుబాటులోకి వస్తాయి. నగరాభివృద్ధి వేగవంతమవుతుంది. రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, వ్యర్థాల నిర్వహణ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి అభివృద్ధికి నిధులు అందుబాటులో ఉంటాయి. పరిశ్రమలు, ఐటీ పార్కులు, హౌసింగ్ ప్రాజెక్టులు విస్తరించేందుకు అవకాశం లభిస్తుంది. స్థానిక ఉద్యోగాలు పెరుగుతాయి. భూముల విలువ పెరిగే అవకాశం ఉంది. రాజకీయ ప్రాధాన్యం పెరుగుతుంది.

ప్రతికూలతలు

పంచాయతీ పరిధిలో వసూలు చేసే పన్నుల కన్నా మున్సిపల్ పరిధిలో ఎక్కువ. పంచాయతీలో భవన నిర్మాణ అనుమతులు సులభంగా వస్తాయి. కార్పొరేషన్ అయితే టౌన్ ప్లానింగ్ నిబంధనలు క్లిష్టంగా ఉంటాయి. పరిధి పెరగడం వల్ల సమర్థంగా సేవలు అందించడం కష్టం కావచ్చు.

గ్రేటర్ ప్రతిపాదిత పంచాయతీల సంఖ్య : 63
ప్రస్తుత మున్సిపల్ పరిధి : 30.17 కి.మీ
ఆదాయం : రూ.149 కోట్లు
ప్రతిపాదిత పరిధి : 299 కి.మీ
విలీనంతో వచ్చే ఆదాయం : రూ33 కోట్లు
నగర జనాభా : 4.52 లక్షలు
63 గ్రామాల జనాభా : 2.98 లక్షలు
ప్రభావిత మండలాలు : తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు

కాలనీల పేర్లు మార్పు

తిరుపతి స్కావెంజర్స్ కాలనీ పేరును స్వచ్ఛతేశ్వర కాలనీ, ఏకలవ్య కాలనీ, సుదాసు కాలనీ, శంభూకుల కాలనీల పేర్లను కౌన్సిల్ ముందు తీసుకురానున్నారు. జ్యోతి లెప్రసీ కాలనీ పేరునూ జ్యోతి కాలనీగా మార్చనున్నారు. ఎస్వీఎస్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డుకు మాజీ ఎమ్మెల్యే మబ్బు రామిరెడ్డి రోడ్డుగా పేరు పెట్టే అంశాన్ని అజెండాలో ఉంచారు. ఈట్ స్ట్రీట్ త్వరితగతిన ఏర్పాటుచేసేందుకు, ఉద్యోగుల పదోన్నతులు, వీఆర్వోల నియామకంతో పాటు పలు అభివృద్ధిపనులతో కూడిన 108 అంశాలపై చర్చించనున్నారు.

సీవోసీ భవనం పూర్తికి కసరత్తు

- రూ.25 కోట్ల రుణంపై నేడు కౌన్సిల్‌లో చర్చ

తిరుపతిలో కార్పొరేషన్ భవన నిర్మాణం పూర్తికి కసరత్తు మొదలైంది. రూ25కోట్ల రుణంతో ఆరు నెలల్లో పనులు పూర్తి చేయాలని నగరపాలకసంస్థ సంకల్పిస్తోంది. దీనికి మంత్రి నారాయణ అంగీకరించినట్టు తెలిసింది. శుక్రవారం నాటి కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చించనున్నారు. 2018లో టీడీపీ హయాంలో స్మార్ట్ సిటీ నిధులతో సిటీ ఆపరేషన్ సెంటర్ (సీవోసీ) నిర్మించాలని ప్రతిపాదించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన మూడేళ్ళ తర్వాత రూ.71కోట్లతో భూమి పూజ చేశారు. రెండేళ్లలో 20 శాతం పనులు కూడా పూర్తిచేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏడాదిలోనే 60 శాతం పనులు (మొత్తం 80 శాతం) పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిచిపోవడంతో మిగిలిన పనులను ఆపేశారు. మరో రూ.40కోట్లు ఉంటే భవనం పూర్తవుతుందని అంచనా. తొలుత రూ.25కోట్లు కాంట్రాక్టర్‌కు చెల్లిస్తే ఆగిన పనులు మొదలు పెట్టొచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఐకానిక్ భవనంలా.. : శ్రీవారి నామాలు ప్రతిబింబించేలా.. సుమారు 1.5 ఎకరాల విస్తీర్ణంలో ఐదు అంతస్తులతో సీవోసీ భవనం రూపుదిద్దుకుంటోంది. నగర భద్రతకు పెద్దపీట వేస్తూ కమాండ్ కంట్రోల్ వ్యవస్థతో పాటు సిటిజన్ సర్వీసెస్, ఎన్విరాన్మెంట్ సైన్సెస్, నీరు, విద్యుత్ వినియోగ వివరాలను ఈ సెంటరు నుంచి పర్యవేక్షించొచ్చు. పీజీఆర్ఎస్ వినతుల స్వీకరణకు ప్రత్యేక హాలు ఉండనుంది. ఇక, మేయర్, డిప్యూటీ మేయర్ల ఛాంబర్లు, కౌన్సిల్ సమావేశ మందిరంతో పాటు కమిషనర్ ఛాంబర్, విభాగాధిపతులకు ప్రత్యేక గదులు ఉంటాయి.



అసంపూర్తిగా ఉన్న సీవోసీ భవనం

విడవని వాన

- నిండిన చెరువులు, జలాశయాలు
- నీట మునిగిన 74 హెక్టార్ల వరిపంట

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం ఉదయం నుంచి వాన తెరపిచ్చినా.. సాయంత్రం మళ్లీ కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి చెరువులు, జలాశయాలు నిండాయి. ఇక, పిచ్చాటూరులో 72 హెక్టార్లలో వరిపైరు, పాకాలలో 2 హెక్టార్లలో వరిపైరు నీట మునిగింది. తొట్టంబేడులో రెండు ఎకరాల్లో కాకర పంట దెబ్బతింది. గురువారం ఉదయం నమోదైన వర్షపాతం వివరాలు.. పిచ్చాటూరులో 85.6మి.మీ, కేవీబీపురం 71.8, చిట్టమూరు 61.2, సత్యవేడు 57.8, నాగలాపురం 57.4, నాయుడుపేట 53, పుత్తూరు 50.8, వాకాడు 49.4, చిల్లకూరు 45.2, ఓజిలి 41, తొట్టంబేడు 38.6, గూడూరు 37.6, వరదయ్యపాళెం 37, శ్రీకాళహస్తి 36.2, డక్కిలి 35.6, ఏర్పేడు 35.4, తడ 33.4, బాలాయపల్లి 31.4మి.మీ.



బీఎన్‌కండ్రిగ మండలం కుక్కంబాకంలో చెరువుకు పడిన బొగడ

జిల్లా అధికారులతో సీఎం సమీక్ష

భారీ వర్షాల నేపథ్యంలో సీఎం చంద్రబాబు గురువారం దుబాయ్ నుంచి వర్ష ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు హాజరయ్యారు. వర్షాల నష్ట నివారణకు జిల్లాలో తీసుకున్న చర్యల గురించి కలెక్టర్ వివరించారు.



స్వర్ణముఖి బ్యారేజీ నుంచి దిగువకు వదులుతున్న వరద ప్రవాహం

స్వర్ణముఖి బ్యారేజీ నుంచి నీటి విడుదల

వాకాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీకి 9వేల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో 7 గేట్లను ఎత్తి 7,500 క్యూసెక్కుల నీటిని దిగువకు... మరో 500 క్యూసెక్కులను దుగరాజపట్నం చెరువుకు వదిలారు. ఈ నేపథ్యంలో బాలిరెడ్డిపాళెం వద్ద వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనకు ఇరువైపుల రాకపోకలు లేకుండా అధికారులు ఆనకట్టలు కట్టారు. 16 గ్రామాలకు పైగా రాకపోకలు ఆగాయి.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి జాతీయ క్రీడా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రీడాకారులు, కోచ్‌లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.డీబీటీ వైఏఎస్-స్పోర్ట్స్‌జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9948444759ను సంప్రదించాలని కోరారు.

ఎస్పీడీసీఎల్‌లో భారీ అవినీతి

- సంతోష్‌రావు హయాంలో అక్రమాలు ప్రారంభం
- సీఎండీకి ఇంటెలిజెన్స్ మాజీ డీజీ ఏబీవీ ఫిర్యాదు

తిరుపతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం (ఎస్పీడీసీఎల్)లో భారీ అవినీతి జరిగిందని ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్, ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపించారు. గురువారం సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ ప్రతినిధులతో పాటు ఆయన తిరుపతి ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ శివశంకర్‌ను కలసి విద్యుత్ పరికరాల కొనుగోళ్ళలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలంటూ ఫిర్యాదు చేశారు. అనంతరం కార్యాలయం వెలుపల సెంటర్ ఫర్ లిబర్టీ సంస్థ వ్యవస్థాపకుడు నలమోతు చక్రవర్తితో కలసి మీడియాతోనూ ఆయన మాట్లాడారు. 'ఎస్పీడీసీఎల్‌లో అవినీతి కొత్త ఒక స్థాయికి పరిమితమై ఉండేది. 2023లో సీఎండీగా సంతోష్ రావు వచ్చాకే భారీ స్థాయిలో అవినీతి అక్రమాలు ప్రారంభమయ్యాయి. విద్యుత్ పరికరాల కొనుగోళ్లలో నిబంధనలు పాటించలేదు. అధిక ధరలతో కొనుగోలు చేశారు. వీటి వివరాలు కోరుతూ సమాచార హక్కు చట్టం కింద డజను సార్లు దరఖాస్తు చేసినా ఎస్పీడీసీఎల్ స్పందించలేదు. మా దరఖాస్తులపై మొదటి, రెండవ అప్పీళ్ళకు వెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో నల్లమోతు చక్రవర్తి రాత్రింబవళ్ళూ కష్టపడి ఆధారాలు సేకరించారు. కేసు వేయడానికి అవసరమైన వివరాలు సమకూర్చారు. నెలన్నర రోజులుగా రెండు మూడు వేదికల నుంచి ఈ వివరాలను ప్రజల ముందుంచుతున్నాం. మా ప్రయత్నాలు ఫలించో లేక యాదృచ్ఛికంగానో సంతోషరావును ఇటీవల ప్రభుత్వం రిలీవ్ చేసింది' అని ఏబీవీ పేర్కొన్నారు. తమ వద్దనున్న ఆధారాలతో ప్రస్తుత సీఎండీ శివశంకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తాను కొత్తగా వచ్చినందున పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవడానికి కొంత వ్యవధి కోరారని ఆయన వివరించారు.



సదరన్ డిస్కం సీఎండీకి ఫిర్యాదు చేస్తున్న ఏబీ వెంకటేశ్వరరావు, నలమోతు చక్రవర్తి తదితరులు

ఆ అవినీతి భారం ప్రజలపైనే

ఎస్పీడీసీఎల్‌లో జరిగే అక్రమాలకు అంతిమంగా ప్రజలే బాధితులవుతున్నారని ఏబీ వెంకటేశ్వరరావు ఆందోళన వ్యక్తంచేశారు. విద్యుత్ పరికరాలను అధిక ధరలకు కొంటే ఆ భారం వినియోగదారులైన ప్రజలపైనే పడుతుందన్నారు. రూపాయి వస్తువును రూ.మూడుకు కొంటే ఆ తేడాను ప్రజలే భరించాల్సి వస్తుందన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుంటే వారు పారిపోతారని, ఆ డబ్బు ఇప్పుడైనా, ఐదేళ్ల తర్వాతైనా చెల్లించాల్సింది ప్రజలేనన్నారు. 'ఇక ప్రజల నుంచి వసూలు చేసిన సర్‌ఛార్జీ రూ. 900 కోట్లు తిరిగి చెల్లించడానికి కూడా ఎస్పీడీసీఎల్ వాయిదాలు పెడుతోంది. యూనిట్‌కు 11 పైసలు చొప్పున ఆరు నెలల్లో తిరిగి చెల్లిస్తామంటున్నారు. అలా చేసినా ప్రజలకు ఎంతోకొంత ఉపశమనం కలిగించినట్లే' అని పేర్కొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ఎస్పీడీసీఎల్‌లో అక్రమాలపై తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామని వెంకటేశ్వరరావు,నల్లమోతు చక్రవర్తి వెల్లడించారు.గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను ఆహ్వానించామన్నారు. ఎస్పీడీసీఎల్‌లో అక్రమాలపై తమ వద్ద వున్న పూర్తి వివరాలను సమావేశంలో వెల్లడిస్తామన్నారు. రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నేతలతో పాటు బాధ్యత కలిగిన ప్రజలెవరైనా వచ్చి తమ వద్ద వున్న సమాచారం ఇవ్వచ్చునన్నారు. వీరితో పాటు డాక్టర్ బాబు సింగిరి నలగాంపల్లి సురేష్ తదితరులున్నారు.

గూడూరు విద్యుత్ స్టోర్స్‌లో ఇద్దరిపై వేటు

తిరుపతి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి లోతేటి శివశంకర్ ఎస్పీడీసీఎల్ సీఎండీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తన పనితీరెలా ఉంటుందో చాటుకున్నారు. గూడూరు మండలం నెల్లటూరులోని ఉమ్మడి నెల్లూరు జిల్లా విద్యుత్ స్టోర్స్‌లో అక్రమాలు జరిగాయని వచ్చిన ఫిర్యాదులపై ఆయన వేగంగా స్పందించారు. స్టోర్స్ ఏడీఈ పి.శంకరయ్య, ఏఈ బి.మల్లిఖార్జునను సస్పెండు చేశారు. ఈ వ్యవహారంతో సంబంధమున్న నెల్లూరు విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో టెక్నికల్ విభాగ ఈఈ ఎస్.బాలచంద్రకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. నెల్లటూరులోని ఈ స్టోర్ నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లాకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, జీఐ వైర్లు, ఇన్సులేటర్లు, కేబుల్ వైర్లు, ఎర్త్ వైర్లు తదితర పరికరాలు సరఫరా అవుతాయి. ఇందులో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులున్నాయి. ప్రధానంగా గత నెలలో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్ నుంచి స్టోర్స్‌కు సుమారు 30 టన్నుల జీఐ వైరు రాగా అందులో కొంత దుర్వినియోగమైనట్టు సమాచారం. ఈ ఫిర్యాదులపై తిరుపతి నుంచి అధికారులు వెళ్లి తనిఖీ చేయగా 5 టన్నుల జీఐ వైరు తక్కువగా ఉన్నట్లు గుర్తించారని తెలిసింది. ఈ విషయం సీఎండీ దృష్టికి పోవడంతో వెంటనే చర్యలు చేపట్టారు.



శంకరయ్య



మల్లికార్జున

మండపానికి రాని పెళ్లికొడుకు

- పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వధువు బంధువులు

పాకాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెళ్లి రిసెప్షన్‌కు సమయం గడిచిపోతున్నా పెళ్లికొడుకు మండపానికి రాలేదు. దీంతో వధువు బంధువులు వెతుకులాట ప్రారంభించారు. ఎంతకీ రాకపోయేసరికి పోలీసు స్టేషన్‌కు పరుగులు తీశారు. వివరాల్లోకెళితే.. పాకాల మండలానికి చెందిన వధువుకు.. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యానికి చెందిన వరుడితో నిశ్చితార్థమైంది. గురువారం ఆనందగిరి ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో పెళ్లి రిసెప్షన్, విందు జరగాల్సి ఉంది. శుక్రవారం ఉదయం 9-10 గంటలకు పెళ్లి జరగాలి. రిసెప్షన్ కోసం వధువు సిద్ధమై ఎదురు చూస్తుండగా వరుడు రాలేదు. దీంతో ఆందోళన చెందిన వధువు బంధువులు పాకాల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పెళ్లి కొడుకు కోసం బంధువులు, పోలీసులు గాలిస్తున్నారు.

చేపలకు వెళ్లి ఇద్దరి గల్లంతు

రెండు మండలాల్లో చేపలకని వెళ్లి ఇద్దరు గిరిజనులు గల్లంతయ్యారు. కాళంగి నది ప్రవాహంలో మేకల పోలయ్య.. చల్లకాలువనదిలో మాణికల పోలయ్య కొట్టుకుపోయారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కాళంగి నది



చల్లకాలువలో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

కాళంగి నదిలో జారిపడి..



మేకల పోలయ్య

దొరవారిసత్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కమ్మకండ్రిగ సమీపంలో గురువారం ఉదయం కాళంగి నదిలో మేకల పోలయ్య(31) గల్లంతయ్యారు. పోలిరెడ్డిపాళెం గిరిజన కాలనీకి చెందిన ఈయన కాళంగి నదిపై తనియాలి ఆనకట్ట(కలుజు) వద్ద చేపలు పట్టేందుకు వెళ్లారు. నిండుగా వరద నీరు ప్రవహిస్తుండగా, వలతో చేపలు పట్టే క్రమంలో కాలుజారి నదిలో పడిపోయారు. వరద తాకిడికి కొట్టుకుపోయారు. పోలయ్యతో పాటు వేటకు వెళ్లిన మరో ముగ్గురు గిరిజనులు గ్రామస్థులకు, వీరు పోలీసులకు సమాచారమిచ్చారు. తహసీల్దారు శైలాకుమారి, ఎస్ఐ అజయ్‌కుమార్ ఘటనా స్థలిని పరిశీలించారు. స్థానికుల సాయంతో పోలయ్య ఆచూకీ కోసం ప్రయత్నించారు. నిండుగా ప్రవహిస్తున్న నదిలో గాలింపు చర్యలు చేపట్టడం సాధ్యం కాని పని కావడంతో గాలింపు చర్యలు చేపట్టలేదు. సాయంత్రానికి కూడా పోలయ్య ఆచూకీ లభ్యం కాలేదు.

చల్లకాలువలో వరద పెరిగి..



మాణికల పోలయ్య

కోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కర్లపూడి పంచాయతీలోని మేకలతోట గిరిజన కాలనీకి చెందిన మాణికల పోలయ్య, స్నేహితుడితో కలిసి గురువారం చల్లకాలువ నదిలో గేలం ద్వారా చేపలు పట్టేందుకు వెళ్లారు. పెద్దగా చేపలు పడకపోవడంతో చివరగా.. గేలాలతో పాటు వలను నదిలోని నీటి ప్రవాహంపై విసిరారు. వల రాకపోడంతో పోలయ్య దానిని పట్టుకుంటూ వెళ్లారు. హఠాత్తుగా వరద పెరగడంతో కొట్టుకుపోయారు. స్నేహితుడి సమాచారంతో గిరిజనులు, తహసీల్దారు జయజయరావు, ఎస్ఐ పవన్‌కుమార్, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. కర్లపూడి వంతెన నుంచి గాలించినా ఆచూకీ లభించలేదు. గోవిందపల్లిపాళెంలోని గజ ఈతగాళ్లు పిలిపించి బోట్లతో గాలించినా ఆయన జాడలేదు.

జీవో నంబరు 17ను రద్దుచేయాలి

గూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ బోర్డు నిధులను దారిమళ్లించే జీవో నంబరు 17ను వెంటనే రద్దుచేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కార్మికశాఖ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, భవననిర్మాణ కార్మికసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

రైతులకు విద్యుత్ కనెక్షన్‌లు ఇప్పించండి

పెళ్లకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట డివిజన్ పరిధిలో అవసరమైన రైతులకు విద్యుత్ కనెక్షన్ల ఇచ్చి ఆదుకోవాలని పెన్నేపల్లి గ్రామా నికి చెందిన టీడీపీ నేత గాలి రమేష్‌నాయుడు ఆ శాఖ ఎస్ఈ విన్నకోటి చంద్రశేఖర్‌రావును కోరారు. గురువారం తిరుపతిలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఈని కలిసి శాలువాలతో సత్కరించారు. ఈయన వెంట దండు మధుసూదన్‌రెడ్డి జలందర్, హేమంత్ కుమార్ రాజారావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒడిశా కార్మికుడికి గాయాలు

తడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో శ్రీసిటీలో పనిచేసే ఒడిశాకు చెందిన కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రతిభాకుమార్ శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గురువారం తడకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరిగి పరిశ్రమకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నగిరి నుంచి శ్రీసిటీలోని ఓ పరిశ్రమకు పేపర్ లోడ్‌తో వెళ్తున్న లారీ శ్రీసిటీ జీరోపాయింట్ వద్ద మలుపు తిరిగేందుకు ఆగింది. వెనుకనే వస్తున్న ప్రతిభా కుమార్ అదుపు తప్పి ఆ లారీని ఢీకొన్నాడు. అతనికి తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స కోసం శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి కొండేపాటి శుభాకాంక్షలు



సూళ్లూరుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని గురువారం టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, పెంచలకోన ఆలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీలు ఆమె ఇంటి వద్ద కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కొండేపాటిని విజయశ్రీ దంపతులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించి సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, టీడీపీ నాయకులు, మురళిరెడ్డి, బొమ్మన్ పళణి, రవి, శెల్వం ఉన్నారు.

వరిపొట్టు ట్రాక్టరు బోల్తా

చిల్లకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నుంచి చెన్నై వైపు వరిపొట్టు లోడుతో బయలుదేరిన ట్రాక్టర్ గురువారం కోట క్రాస్‌రోడ్డు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలు కాకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది ట్రాఫిక్ అవసరమైన చర్యలు చేపట్టారు.

బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకం

తడ/గూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. డైరెక్టర్లగా 15 మందిని నియమించగా అందులో సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన బొమ్మన్ పళణి, గూడూరుకు చెందిన కోడిపత్తి శ్రీధర్‌లకు డైరెక్టర్లగా అవకాశం దక్కింది. బెస్త కార్పొరేషన్ చైర్మన్‌గా తడ మండలానికి చెందిన బొమ్మన్ శ్రీధర్‌కు అవకాశం దక్కింది.

కోదండ రామాలయ పాలకమండలి నియామకం

చిల్లకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మినపట్నం గ్రామంలోని కోదండ రామస్వామి ఆలయం పాలకమండలి నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కోట సతీష్, భక్తాని రామయ్య, వీ.మహాలక్ష్మి, కే.సుబ్రమణ్యం, ఎం.లక్ష్మమ్మ, కొలంగిరి కోటేశ్వరమ్మ, పాముల రవి, నెల్లిపూడి రాజేశ్వరమ్మ, కోడి పోలయ్య, రాజమహేంద్రవరం రత్నమ్మ, దూబగుంట నిరంజన్‌రావులను నియమించారు.

సీఎం సహాయ నిధి పంపిణీ



గూడూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోట మండలం పెద్దగోవిందపల్లి గ్రామానికి చెందిన కాల్తిరెడ్డి సుభాషిణి కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న సుభాషిణి తిరుపతిలో వైద్యం చేయించుకుంది. ఈ క్రమంలో సీఎం సహాయనిధి నుంచి రూ. 3లక్షలు మంజూరైంది. ఆ చెక్కును ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. నటశేఖర్, సునీల్, సందీప్, పార్వతయ్య ప్రసన్న పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

నాయుడుపేట టౌన్: నాయుడుపేట సొసైటీ కార్యాలయం వద్ద గురువారం సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్ నాయుడు, ఏవో గణేష్‌లు రైతులకు యూరియా పంపిణీ చేశారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

సూళ్లూరుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం వేధిస్తున్న భర్తతో సహా మామ, మరిది పై పోలీసు కేసు నమోదైంది. బాధితురాలి కథనం మేరకు.. కోళ్లమిట్టకు చెందిన ఇరగరాజు వెంకయ్యతో విజయలక్ష్మికి మూడేళ్లక్రితం వివాహమైంది. పెళ్లి అయినప్పటి నుంచి భర్త చెడు వ్యసనాలకు బానిసై నిత్యం భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో కొంతంకాలంగా భర్తతో కలిసి మామ ఇరగరాజు శేషయ్య, మరిది తింగయ్య అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

ఆలయ నిర్మాణ స్థల పరిశీలన

సూళ్లూరుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని స్వతంత్రపురంలో ఉన్న ఆలయ నిర్మాణ స్థలాన్ని గురువారం ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ పరిశీలించారు. ఇక్కడున్న ఖాళీ స్థలంలో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణ మందిర నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ స్థలంలో ఆలయ నిర్మాణ పనులపై పలు అభ్యంతరాలు వ్యక్తం కావడంతో స్థలాన్ని పరిశీలించి సంఘ నాయకులతో మాట్లాడారు. అందరికీ ఆమోద యోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు ఏజీ కిషోర్, మురళిరెడ్డి, కృష్ణయ్య ఉన్నారు.

బాలికను వేధించిన కేసులో జైలు

గూడూరు అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలికను ప్రేమపేరుతో వేధించి గాయపరిచిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పుచెప్పారు. గూడూరు రెండో పట్టణంలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదివే బాలికను నరసింగరావుపేటకు చెందిన ఏసు అలియాస్ అఖిల్ (24) ప్రేమించమని 2022 ఫిబ్రవరి 1వ తేదీన గాయపరిచాడు. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారైంది.

కాళంగి నదికి తాత్కాలిక పొర్లుకట్ట



సూళ్లూరుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని డంపింగ్ యార్డు వద్ద కాళంగి నది నీటి ప్రవాహం పట్టణమీదకు ప్రవ హించకుండా ఉండేందుకు రక్షణగా తాత్కాలిక పొర్లుకట్టను అధికారులు ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల మీదుగా కాళంగి నది ప్రవహించి పులికాట్‌లో కలుస్తుంది. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కాళంగికి భారీగా నీరు చేరింది. దీంతో రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ డంపింగ్ యార్డు వద్ద కాళంగి నది పొర్లుకట్టకు రక్షణగా రీ స్లైకింగ్ చేసిన వ్యర్థాల పొడిని తాత్కాలికంగా వేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇరిగేషన్ అధికారులు బుధవారం రాత్రికి రాత్రే వరదనీరు పొంగి ప్రవహించ కుండా ఉండేందుకు రక్షణగా తాత్కాలికంగా పొర్లుకట్టను ఎక్స్‌కవేటర్ల సాయంతో వేశారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు కలుషితంగా కాకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ ధనలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో మండల ప్రత్యేక అధికారి గోవర్ధన్‌రెడ్డితో కలసి ఆమె పాల్గొన్నారు.

తాడేపల్లి ప్యాలెస్‌లోనే కల్తీ మద్యం ఫార్ములా రూపకల్పన

వెంకటగిరి, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి ప్యాలెస్ నుంచే కల్తీ మద్యం ఫార్ములాకు రూపకల్పన జరిగిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆరోపణలు చేశారు. గురువారం తన నివాసంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ తన పాలనలో మద్యం ద్వారా రూ.3500 కోట్లు దోచుకున్నారని విమర్శించారు. తనకు భూ ఆక్రమణలతో సంబంధం ఉందని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసుగంగాధర్, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, సత్యనారాయణ, చంద్రమౌళిరెడ్డి, ఆనంద్, శ్రీహరి, ప్రహలాదా, మురళి ఉన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ



సూళ్లూరుపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ద్వారా చేతి వృత్తుల వారికి పనిముట్లు అందజేస్తున్నట్లు విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు సూళ్లూరు పేట తపాలా కార్యాలయానికి కుట్టు మిషన్లు చేరాయి. ఈ కుట్టు మిషన్లను పోస్టుమాస్టర్ సాల్మన్ ఆధ్వర్యంలో గురువారం లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 61 మంది లబ్ధిదారులకు కుట్టు మిషన్లు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పవన్, గురవయ్య తదితరులు ఉన్నారు.

అన్నమేడు కాలువలో పూడికతీత

నాయుడుపేట: నాయుడుపేట భరత్ నగర్ ప్రాంతంలో స్వర్ణముఖినది నుంచి ప్రారంభమయ్యే అన్నమేడు పంటకాలువ పూడికతీత పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ప్రారంభించారు. ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలతో కాలువ పూడిపోకుండా ముందస్తుగా పంటకాలువ పూడికతీత చేపట్టారు.



